



## రాయితీ పనిముట్లను సద్వినియోగం చేసుకోండి

రైతులకు ఎంపీ అంబికా సూచన

సబ్సిడీకి సంబంధించిన మెగా చెక్కు అందజేత



పరికరాలను పరిశీలిస్తున్న ఎంపీ, అధికారులు

అనంతపురం కలెక్టరేట్, జూన్18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీతో అందజేసిన వ్యవసాయ యంత్ర పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనం వద్ద బుధవారం నిర్వహించిన వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఎంపీతో పాటు జేసీ శివనారాయణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ... ఐదేళ్ల వైసీపీ పాలనలో సబ్సిడీ పనిముట్లు, డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీని అటకెక్కించారన్నారు. కూటమి అధికారం చేపట్టగానే మళ్లీ వాటిని పునరుద్ధరిస్తోందన్నారు. జేసీ మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతులకు వ్యక్తిగతంగా 50 శాతం రాయితీపై వివిధ వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్నామన్నారు. జిల్లాలో 1,070 మంది రైతులకు రూ.2.29కోట్ల విలువైన పనిముట్లు ఇచ్చామన్నారు. అందుకు సంబంధించిన మెగా చెక్కును రైతులకు ఎంపీ, జేసీ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ, జడ్పీ సీఈఓ శివశంకర్, ఆగ్రోస్ డీఎం ఓబుళపతి, ఏఓలు, రైతులు పాల్గొన్నారు.

# ఆగుతూ... సాగుతూ..

## హెచ్చెల్సీ అభివృద్ధి పనుల్లో జాప్యం



137.702 కిలోమీటరు వద్ద జరుగుతున్న అండర్ టన్నెల్ నిర్మాణ పనులు

పనులకు వానదెబ్బ..

ఇంజనీర్ల నిర్లక్ష్యం

రూ.33.89కోట్లతో చేపట్టిన 11పనులపై నీలినీడలు

మూడు నెలలు కావస్తున్నా సగం కూడా పూర్తికాని వైనం

అనుకున్న సమయానికి పనుల పూర్తిపై సందేహం



అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ పనుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో వచ్చే నెలాఖరుకు పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. అయితే జూలై ఒకటిన కాలువకు నీటిని విడుదల చేస్తామని టీబీ డ్యాం బోర్డు అధికారులు ఇప్పటికే చెప్పారు. పనులు జరుగుతున్నందున జూలై ఆఖరులో ఇవ్వాలని జిల్లా ఇంజనీర్లు టీబీ డ్యాం బోర్డుకు విజ్ఞప్తి చేసుకున్నారు. అయితే ఈ పనుల జాప్యంతో జిల్లాకు ఎక్కువ నీటిని తీసుకునే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి నెలకొంది. చేపట్టిన పనులు నెలరోజుల్లో పూర్తి చేసి జిల్లాకు అధికంగా నీటిని అందించి, పంటల సాగుకు ఊతమివ్వాలని రైతులు కోరుతున్నారు.

### ఉద్యోగ విరమణలతో సమస్యలు

ఏప్రిల్ నెలాఖరులో హెచ్చెల్సీ రెగ్యులర్ ఎస్ఈ రాజశేఖర్ ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఈ నెలలో నంద్యాల ఎస్ఆర్‌బీసీ ఎస్ఈ పురార్ధన్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఆయన కేవలం మూడు సార్లు మాత్రమే అనంతపురానికి వచ్చారు. ఈయన కూడా ఈనెలాఖరులో ఉదోయగ విరమణ పొందనున్నారు. అంతేగాక హెచ్చెల్సీలో ప్రధాన విభాగమైన లోకలైజేషన్ ఈఈగా ఉన్న వెంకటరమణారెడ్డి గత నెలలో రిటైర్డ్ అయ్యారు. ఇలా కీలక పోస్టుల్లో ఇన్‌చార్జిలు ఉండటంతో పర్యవేక్షణ

(మిగతా 6లో...)

## నెలాఖరుకల్లా పనులు పూర్తి చేయండి

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



హెచ్చెల్సీ అధికారులతో సమీక్షిస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, జూన్ 18(ఆంధ్ర జ్యోతి): తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) మరమ్మతు పనులు ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశించారు. తన నివాసంలో బుధ వారం ఆయన హెచ్చెల్సీ అధికారులతో సమీక్షించారు. రుతుపవనాల ప్రభావంతో తుంగభద్ర డ్యాంకు ముందస్తుగా నీరు చేరుతోందని, జూలై మొదటి వారంలోనే కాలువకు నీటిని విడుదల చేసే అవకాశాలున్నా యన్నారు. ప్రధాన కాలువ పరిధిలోని వివిధ చోట్ల జరుగుతున్న అండర్‌టన్నెల్, బ్రిడ్జి, లైనింగ్ పనుల పురోగతిపై ఆరాతీశారు. పనులు అలస్యమైతే నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. ఈ సారి ముందే నీటిని విడుదల చేయడానికి వీలుగా పనుల్లో వేగం పెంచాలన్నారు. వైసీపీ పాలనలో కాలువ మరమ్మతు పనులు జరగకపోవడంతో పదే పదే గండ్లు పడి పొలాలకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.35 కోట్లు మంజూరు చేయించి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టినట్లు తెలిపారు. సమీక్షలో ఈఈ పార్థసారథి, డీఈ దివాకర్‌రెడ్డి, జేఈ అల్తాఫ్‌లు పాల్గొన్నారు.

## పోలీస్ టెక్నికల్ టీం సేవలు భేష్: ఎస్పీ

25 మందికి అభినందన



ఎస్పీ నుంచి స్మార్ట్ వాచ్‌లు అందుకుంటున్న టీం సభ్యులు

అనంతపురం క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖలో ఐటీ అప్లికేషన్ల అమలు చేయడంలో పోలీస్ టెక్నికల్ టీం సేవల అభినందనీయమని జిల్లా ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. పోలీస్ ఐటీ కోర్ టీంలో ఉన్న 25 మందిని బుధవారం డీపీఓలో ఎస్పీ జగదీష్ ప్రత్యేకంగా అభినందించారు. వాళ్లకు ప్రోత్సాహకం కింద స్మార్ట్ వాచ్‌లు అందించి ప్రశంసించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం జిల్లా పోలీస్‌శాఖ 12 ఐటీ అప్లికేషన్లు అమలు చేస్తోందన్నారు. ఇందులో స్మార్ట్ పోలీస్, సీసీటీఎన్ఎస్, మీ సేవ, ఐరాడ్, ఈ చలానా తదితర అప్లికేషన్లు కీలకమైనవన్నారు. ఐదు నెలల కిందట నీలం సంజీవరెడ్డి స్టేడియంలో కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య( పీఎంటీ, పీఈటీ) పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ ప్రక్రియలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, బయోమెట్రిక్ సేకరణ, ఇతర ఫిజికల్ మెజర్‌మెంట్స్, 1600, 100 మీటర్లు, లాంగ్ జంప్, హై జంప్, ఎత్తు, ఛాతీ కొలతలు తీసుకోవడం, ఇతర ప్రక్రియలు జాప్యం లేకుండా చేయడంలో టెక్నికల్ టీం వేగంగా స్పందించిందన్నారు. వాళ్ల సేవలు ప్రశంసనీయం అంటూ అభినందించారు.

# కష్టపడ్డోళ్లను గుర్తిస్తాం

- టీడీపీ అర్బన్ పరిశీలకుడు సోమిశెట్టి
- పార్టీ సంస్థాగత ఎన్నికలపై సమావేశం



మాట్లాడుతున్న పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు

'వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు చాలా ఇబ్బందులు పడ్డాం. మాపై కేసులు పెట్టారు. ఆర్థికంగా నష్టపోయాం. మమ్మల్ని గుర్తించాలి. పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులలో మాకు న్యాయం చేయాలి' అని టీడీపీ నాయకులు, కార్యకర్తలు విన్నవించారు. పార్టీ సంస్థాగత ఎన్నికల కోసం అర్బన్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన సమావేశంలో వారు గళం విప్పారు. దీనికి పార్టీ పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు సానుకూలంగా స్పందించారు. కష్టపడ్డవారిని వందశాతం గుర్తిస్తామని భరోసా ఇచ్చారు.

(వివరాలు 6లో..)

## జీవిత ఖైదీలకు స్వేచ్ఛ

ఉమ్మడి జిల్లాలో ఐదుగురి విడుదల

7

## ఇంకెంతసేపో..!

తల్లికి వందనం డబ్బు డ్రాకు భారీ క్యూలు



హెడ్ పోస్టాఫీసు వద్ద..

అనంతపురం విద్య, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం డబ్బులు డ్రా చేసుకునేందుకు మహిళలు బ్యాంకులు, సేవాకేంద్రాలకు క్యూ కడుతున్నారు. అనంతపురంలోని హెడ్ పోస్టాఫీసు వద్దకు భారీగా తరలివస్తున్నారు. మూడోరోజు బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల తల్లులు భారీగా వచ్చారు. దీంతో క్యూ చాంతాడంత కనిపించింది. ఆఖరుకు డబ్బు తీసుకుని, మహిళలు ఆనందంగా వెళ్లిపోయారు. మూడోరోజు పంపిణీ కౌంటర్ మరొకటి పెంచడంతో మహిళలకు కొంత ఉపశమనం లభించింది.

## ఏం పీ..తావో చూస్తా...!



కారును తీసుకెళ్తున్న పోలీసులు

అనంతపురం నగరంలోని లలితకళా పరిషత్ వద్ద ఓ యువకుడు బుధవారం రాత్రి ట్రాఫిక్ పోలీసులకు ఎదురు తిరిగాడు. రోడ్డుపై కారు ఆపి ఫోన్‌లో మాట్లాడుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు ప్రశ్నించారు. కారు దిగకుండా, నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో లైసెన్స్ చూపించాలని అడిగారు. దీంతో ఆ యువకుడు మరింత రెచ్చిపోయాడు. 'లైసెన్స్ చూపించను.. ఏం పీ..ంటావో.. పీక్కో..' అని ఎదురుతిరిగాడు. ఈ క్రమంలో ఆ యువకుడికి, పోలీసులకు కాసేపు వాగ్వాదం జరిగింది. చుట్టూ జనం పోగయ్యారు. విసుగుచెందిన పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని టూటౌన్ పోలీసులకు అప్పగించారు. కారును కూడా స్టేషన్‌కు తరలించారు. ఆ యువకుడు ఎవరు..? ఎందుకంత ధీమా..? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

## పాపం పసివారు..!

రెండేళ్ల కిందట తల్లి..

ఇప్పుడు తండ్రి మృతి

దిక్కులేనివారైన ముగ్గురు చిన్నారులు



పూజారి చిత్రమ్మ పూజారి బాలు (ఫైల్)



అనాథలైన ముగ్గురు చిన్నారులు

కళ్యాణదుర్గం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల మరణంతో ముగ్గురు చిన్నారులు దిక్కులేనివారయ్యారు. కళ్యాణదుర్గం వాల్మీకి సర్కిల్ ప్రాంతంలో ఉంటున్న పూజారి బాలు, చిత్రమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. అనారోగ్యంతో చిత్రమ్మ రెండేళ్ల క్రితం మృతిచెందారు. అప్పటి నుంచి పిల్లల ఆలనాపాలన తండ్రే చూసుకునేవారు. కుమారులు తిప్పేస్వామి 4వ తరగతి, బాబు 3వ తరగతి చదువుతున్నారు. కూతురు హారిక వయసు రెండేళ్లు మాత్రమే. భార్య దూరమైనా.. పిల్లలను బాగా చదివించాలని, వారి భవిష్యత్తు బాగుండాలని బాలు తపించేవారు. కూరగాయల వ్యాపారం చేస్తూ, అక్కమ్మ ఆలయంలో పూజారిగా పని చేస్తూ వారిని పోషించేవారు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో 'నా బిడ్డలను మంచి బడిలో చేర్పిస్తాను. ఎక్కడైతే బాగుంటుందో చెప్పండి..' అని స్థానికులను ఇటీవలే ఆరా తీశారు. కానీ బిడ్డల బంగారు భవిష్యత్తును చూడాలన్న ఆయన సంకల్పం నెరవేరలేదు. పూజారి బాలు గుండెపోటుతో బుధవారం ఇంట్లోనే కుప్పకూలిపోయారు. తండ్రి మృతదేహం వద్ద ముగ్గురు చిన్నారులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. తల్లిదండ్రులను కోల్పోయామన్న విషయాన్ని అర్థం చేసుకోలేని వయసు వారిది. వారికి వచ్చిన కష్టాన్ని చూసి స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ గోవిందప్ప వారికి రూ.5వేలు సాయం చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి చిన్నారులను ఆదుకుంటామని తెలిపారు.

# బదిలీల్లో ఆంతర్యమేంటో ?

- జిల్లా కేంద్రానికి సమీప మండపంలో పనిచేస్తున్న ఓ అధికారిని అదే నియోజకవర్గంలోని ఓ మండలానికి బదిలీ చేశారు. కానీ అది నిలిచిపోయింది. అధికార పార్టీ వారి పనులు చేయడం లేదనే బదిలీకి సిఫార్సు చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే ఆయన అనారోగ్య కారణాలు చూపి ఉన్నతాధికారులకు విన్నవించుకోవడంతో బదిలీ ఆగినట్లు తెలిసింది.
- రాయదుర్గం నియోజకవర్గంలో ఓ మండలానికి అధికారిగా వచ్చిన వ్యక్తిని తాజా బదిలీల్లో తాడిపత్రి నియోజకవర్గానికి బదిలీ చేశారు. అక్కడ చేరకముందే రాయదుర్గం నియోజకవర్గంలోని మరో మండలానికి బదిలీ ఆర్డర్ తెప్పించుకున్నారు. కానీ ఇంకా జాయిన్ కాలేదు. అక్కడ స్థానిక నాయకులు ఆ అధికారిని కోరుతున్నా ఓ కీలక నేత విముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే ఈ నేత వద్దన్నట్లు తెలిసింది.
- గుంతకల్లు నియోజకవర్గంలో ఓ మండలాధికారికి భూముల సమస్య పెద్ద తలనొప్పిగా మారింది. గతంలో పనిచేసిన ఓ అధికారి భూముల విషయంలో తలదూర్చాడు. అప్పట్లో ఇష్టారాజ్యంగా డీ పట్టాలిచ్చేశారు. ఇప్పుడు వాటిని క్రమబద్ధీకరించే విషయంలో ప్రస్తుత అధికారిపై అధికార పార్టీ నుంచి కొంత ఒత్తిడి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే బదిలీ అయినట్లు సమాచారం.



ఏడాదిలోపే తహసీల్దార్లకు స్థానచలనం

వాటిలోనూ అప్పటికప్పుడు మార్పులు

కొన్ని సీట్లకు ముడుపులు...?


అనంతపురం కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వాళ్లు ఆ సీట్లలో కూర్చొని ఏడాది కూడా కాలేదు అప్పుడే బదిలీ చేశారు. ఎందుకిలా జరిగిందోననే చర్చ సర్వత్రా నడుస్తోంది. జిల్లాలో తాజాగా జరిగిన తహసీల్దార్ల బదిలీల అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. బదిలీలైనా సక్రమంగా జరిగాయా అంటే అదీ లేదు. ఒక్కొక్కరిని రెండు, మూడు చోట్లకు మార్చారు. దీంతో వీటిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా ఉన్నతాధికారుల నిర్ణయంతో జరిగిందా..? లేక సంబంధిత తహసీల్దార్లు వ్యక్తిగతంగా పెట్టుకున్న విజ్ఞప్తులా..? లేక రాజకీయ ఒత్తిడులా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తాజా బదిలీల్లో అవినీతికి అలవాటు పడిన కొందరు ముడుపులు ఇచ్చుకోవడానికి సైతం వెనుకాడలేదని తెలిసింది. మరికొందరు కేవలం అధికార పార్టీ రాజకీయంతో సీట్లు వదులుకోవాల్సి వచ్చింది. జిల్లాలో కొన్ని తహసీల్దార్ పోస్టులు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. వాటిని ఎప్పుడు భర్తీ చేస్తారో అర్థం కాని పరిస్థితి. ఇక డిప్యూటీ తహసీల్దార్లనూ బదిలీ చేశారు. వారిలో కొందరిని అనుకూల సీట్లకు కేటాయించారనే ఆరోపణలున్నాయి.

### కాసులు.. రాజకీయ ఒత్తిళ్లు..

ఆయన కూటమి ప్రభుత్వం కొలువుదీరిన కొత్తలో శింగనమల నియోజకవర్గంలోని ఓ మండలానికి అధికారిగా వచ్చారు. వచ్చినప్పటి నుంచి వసూళ్ల పర్వం మొదలు పెట్టారు. వ్యవహారం ముదిరిపోవడంతో మరో మండలానికి బదిలీపై వెళ్లాలనుకున్నారు. తొలుత జిల్లా కేంద్రం సమీప మండలానికి ప్రయత్నించారు. అందుకు రూ.8లక్షలు అధికారపార్టీ కీలక నేతకు ముట్టజెప్పినట్లు సమాచారం. అయితే అది కాస్తా బెడిసి కొట్టడంతో అదే నియోజకవర్గంలో మరో మండలంలోని సీటులో ఆశీనులయ్యారు. ఈ అధికారిని కలెక్టరేట్‌లో ఓ సెక్షన్‌కు బదిలీ చేయగా, మార్పు చేయించుకుని మరోసారి బదిలీ ఆర్డర్ తెప్పించుకోవడమే అక్రమాలకు నిదర్శనం.

### నెలలుగా ఖాళీ..

జిల్లాలో కొన్ని మండలాలకు నెలలుగా తహసీల్దార్లు లేని పరిస్థితి ఉంది. జిల్లాలో అత్యధిక మండలాలున్న అనంతపురం ఆర్డీఓ కార్యాలయానికి సంబంధించి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ) సీటు దాదాపు 8నెలలుగా ఖాళీగా ఉంది. దాన్ని భర్తీ చేయడం లేదు. కలెక్టరేట్‌లోని ల్యాండ్ రీఫార్మ్స్ పర్యవేక్షించే తహసీల్దార్ స్థాయి అధికారి పోస్టు ఖాళీగా ఉంది. వజ్రకరూరు తహసీల్దారు నజీర్ రెండు నెలల కిందట ఉద్యోగ విరమణ చేశారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కూడేరు తహసీల్దారు బదిలీ కావడంతో ఏడాది నుంచి ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్‌బాషా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. విడపనకల్లు తహసీల్దార్‌గా ఉన్న సునీతాబాయి నాలుగు నెలల కిందట ప్రమోషన్‌పై వెళ్లడంతో అప్పటి డీటీకి ఇన్‌చార్జ్ ఇచ్చారు. తాజాగా ఉరవకొండ సివిల్ సప్లయిస్ డీటీ చంద్రమోహన్‌రావును ఇన్‌చార్జ్‌గా నియమించారు. పుట్లూరు తహసీల్దార్ శేషారెడ్డి బదిలీ అయ్యాక ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. వీరందరి స్థానాలను ఎప్పుడు భర్తీ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.









# బోగీలో భోజనం..!

● ఆకట్టుకుంటున్న రైలు కోచ్ రెస్టారెంట్ ● అనంత రైల్వేస్టేషన్ లో అందుబాటులోకి..

అనంతపురం న్యూటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణంలో భోజనం చేయడం అంటే ఓ ప్రత్యేక అనుభూతి. అందులోనూ ఏసీ బోగీలో అయితే ఆ ఫీలే వేరు. నలుగురు స్నేహితులతోనో, సన్నిహితులతోనో కబుర్లు చెబుతూ కాఫీ సిప్ చేస్తూ.. స్నాక్స్ తింటూ ఉంటే ఆ ఆనందాన్ని మాటల్లో వర్ణించలేం. అలాంటి గొప్ప అనుభూతి తరచూ పొందాలని అందరూ కోరుకుంటుంటారు. అది కుదిరే పనికాదు, రైలు ప్రయాణమే చేయాలి, తోడుగా స్నేహితులూ ఉండాలి. అది ఎప్పుడో తప్ప.. వీలుకాదు. ఆ కోరికను నెరవేర్చుకునేందుకు అనంతపురం రైల్వే స్టేషన్‌లో రైలు కోచ్ రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. ఏకంగా ఓ ఏసీ బోగీనే అందుకు వినియోగించారు. బోగీలోని సీట్లలో కూర్చుని, కబుర్లు చెబుతూ కాఫీ, స్నాక్స్, భోజనం చేసే వెసులుబాటు కల్పించారు. 24 గంటలు ఈ రెస్టారెంట్ ఓపెన్‌లోనే ఉంటుంది. రైలు బోగీలో భోజనం చేయడానికి నగర ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.



## డీడీగా శ్రీనివాసరావు నియామకం

అనంతపురం విద్య, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకుడి(డీడీ)గా శ్రీనివాసరావు నియమితుడయ్యారు. ఇక్కడ డీడీగా పనిచేస్తున్న రామాంజనేయులును మాతృశాఖ పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న శ్రీనివాసరావును అనంతకు ప్రభుత్వం నియమించింది. ఈమేరకు రాష్ట్ర గిరిజనసంక్షేమశాఖ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సోమవారం విధుల్లో చేరే అవకాశాలున్నాయని ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది.

## సమగ్రశిక్షలోనూ బదిలీలు

● రిక్వెస్ట్, మ్యూచువల్స్‌కే అవకాశం
● 21 వరకు దరఖాస్తులు ● ఏపీసీ శైలజ వెల్లడి

అనంతపురం విద్య, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలోనూ బదిలీల ప్రక్రియ మొదలైంది. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం సమగ్రశిక్ష ఏపీసీ శైలజ వెల్లడించారు. జిల్లాలోని కేజీబీవీల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, మండలస్థాయిలో పనిచేస్తున్న ఐఈఆర్‌పీ, పీటీ, సీఆర్‌ఎంటీలు, అకౌంటెంట్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీస్ సబార్డినేట్లు, సైట్ ఇంజినీర్లకు బదిలీలు నిర్వహిస్తామన్నారు. రిక్వెస్ట్, మ్యూచువల్ బదిలీలకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి వారు ఈనెల 21వతేదీలోగా దరఖాస్తును జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు. అభ్యర్థుల స్టేషన్ సీనియారిటీ, స్పెషల్ సర్వీస్ సీనియారిటీ పాయింట్లను ఈఏడాది ఏప్రిల్ 30 వరకు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లాలనుకునేవారు దరఖాస్తులను రాష్ట్ర కార్యాలయానికి పంపించాల్సి ఉంటుందని ఏపీసీ వివరించారు.

## బాధ్యతలు స్వీకరించిన వయోజన విద్య డీడీ వెంకటేశ్వర్లు



డీడీ వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలుపుతున్న కార్యాలయ సిబ్బంది, విద్యాపర్యవేక్షకులు

అనంతపురం విద్య, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వయోజన విద్య ఉపసంచాలకుడి(డీడీ)గా వెంకటేశ్వర్లును ప్రభుత్వం నియమించింది. ఇక్కడ పనిచేస్తున్న డీడీ ఆంజనేయులును గుంటూరుకు బదిలీ చేసారు. ఆయన స్థానంలో కర్నూలు జిల్లాలో ఏడీగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును ఇక్కడికి డీడీగా నియమిస్తూ బుధవారం వైద్యశాఖ కమిషనర్ ఉత్తర్వులు జా రీ చేశారు. దీంతో బుధవారం వెంకటేశ్వర్లు జిల్లాకు చేరుకుని, తొలుత కలెక్టర్‌ను కలిశారు. అనంతరం జిల్లా వయోజన విద్య కార్యాలయానికి చేరుకుని, అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. డీడీ వెంకటేశ్వర్లుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# కష్టపడ్డోళ్లను గుర్తిస్తాం

● టీడీపీ అర్బన్ పరిశీలకుడు సోమిశెట్టి ● పార్టీ సంస్థాగత ఎన్నికలపై సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం క్రైం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసినవారిని వంద శాతం గుర్తిస్తామని టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ అర్బన్ నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల సమావేశాన్ని నగరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిశెట్టి మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టారని అన్నారు. అయినా చాలా మంది పార్టీ కోసం కష్టపడ్డారని అభినందించారు. నామినేటెడ్ పోస్టుల కోసం 150 నుంచి 170 మంది వివరాలను పార్టీ హైకమాండ్‌కు పంపామని తెలిపారు. చిన్న పొరపాట్లు ఉన్నా సర్దుకుని వెళ్లాలని, అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. 2029లో చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసేలా పనిచేయాలని సూచించారు. అంతకు ముందు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ చౌదరి, టీడీపీ కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకూ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చాలా మంది కార్యకర్తలు కష్టపడి పనిచేశారని అన్నారు. టీడీపీలో కుల మతాలు ఉండవని, పార్టీ నిర్ణయమే ఫైనల్ అని అన్నారు. బాగా కష్టపడి ఎమ్మెల్యేని గెలిపించారని, అదే స్ఫూర్తితో కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించేలా ముందుకెళ్లాలని సూచించారు. టీడీపీలో కార్యకర్తే అధినేత అని జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ అన్నారు. కష్టపడే వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. సెంట్రల్ పార్టీ ఐవీఆర్‌ఎస్ ద్వారా పదవులకు అర్హులను ఎంపిక చేస్తుందని తెలిపారు.

### కళ్లలో పెట్టి చూసుకుంటా: దగ్గుపాటి

టీడీపీ కార్యకర్తలను ఐదేళ్లపాటు వైసీపీ ఎంతగానో ఇబ్బంది పెట్టిందని, అయినా తనను భారీ మెజారిటీతో గెలిపించారని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. కార్యకర్తలను కళ్లలో పెట్టుకుని చూసుకుంటానని అన్నారు. తన గెలుపు కోసం పనిచేసినవారితోపాటు పని చేయని వారు వచ్చి అడిగినా పనులు చేయడానికి, సేవ చేయడానికి సిద్ధంగా ఉంటానని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో కార్యకర్తలకు 24 గంటలు అందుబాటులో ఉంటామని అన్నారు. నగరంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, 35 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న డంపింగ్ యార్డ్‌ను దూరంగా తరలించి సమస్య లేకుండా చేస్తామని అన్నారు. రూ.750 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసినవారిని గుర్తించి, సంస్థాగత ఎన్నికల్లో పదవులు ఇస్తామని తెలిపారు. డివిజన్, ఇతర పదవుల్లో న్యాయం చేస్తామని అన్నారు. పోటీ లేని చోట, అభ్యర్థులు లేని చోట ఏకగ్రీవంగా ఎంపిక చేస్తామని తెలిపారు.



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

## డాబా వద్ద ఘర్షణ

పరిటాల శ్రీరామ్, గోనుగుంట్ల అనుచరులపై కేసు



గాయపడిన అరవిందరెడ్డి, నాగరాజు, ఖాశీం వలి

చెన్నేకొత్తపల్లి/ధర్మవరం, జూన్18(ఆంధ్రజ్యోతి): చెన్నేకొత్తపల్లి సమీపంలోని ఓ డాబా వద్ద మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ వర్గీయులు బుధవారం పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ గొడవలో మాజీ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు చిగిచెర్ల అరవింద రెడ్డి, పరిటాల శ్రీరామ్ అనుచరులు నాగరాజు, ఖాశీం వలి గాయపడ్డారు. ఇరువర్గాలపై హత్యాయత్నం కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. టీడీపీ కార్యర్తల ఫిర్యాదు మేరకు, దామాజుపల్లికి చెందిన ఖాశీం వలి, నాగరాజు డాబా వద్ద టీ తాగుతూ పరిటాల శ్రీరామ్ గురించి చర్చించుకుంటున్నారు. అదే సమయంలో ధర్మవరం మండల చిగిచెర్లకు చెందిన అరవింద రెడ్డి మరికొందరు అక్కడికి వచ్చారు. పరిటాల శ్రీరామ్ గురించి ఎందుకు చర్చించుకుంటున్నారని అరవిందరెడ్డి విమర్శించాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం మొదలైంది. అరవిందరెడ్డి డాబాలో ఉన్న వంటగదిలోకి వెళ్లి కత్తి తీసుకుని టీడీపీ కార్యకర్తలపై దాడికి యత్నించాడు. వారు పారిపోతున్నా వెంబడించడంతో ఎదురుతిరిగారు. పరస్పరం దాడులు చేసుకున్నారు. గాయపడిన ముగ్గురిని అనంతపురంలోని వేర్వేరు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. టీడీపీ కార్యకర్త నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు అరవిందరెడ్డిపై కేసు నమో దు చేశారు. కాగా, పరిటాల శ్రీరామ్ అనుచరుడు వెంకటేశ్ యాదవ్ పెనుకొండలో పని ఉందని నమ్మబలికి తనను కారులో చెన్నేకొత్తపల్లి సమీపంలోని డాబా వద్దకు తీసుకెళ్లాడని అరవిందరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి ఎన్‌ఎస్ గేటు, దామాజుపల్లికి చెందిన పరిటాల శ్రీరామ్ అనుచరులు ఖాశీం, దుబ్బ, నాగరాజు, పులి తదితరులు వచ్చారని, పరిటాల శ్రీరామ్ గురించి ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతావా అంటూ తనపై దాడిచేశారని పేర్కొన్నారు. అతని ఫిర్యాదు మేరకు పులి, నాగరాజు, ఖాశీం, అంజి, వెంకటేశ్‌యాదవ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

### అదృశ్యమైన మహిళ అప్పగింత

అనంతపురం క్రైం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మహిళ మిస్సింగ్‌పై కేసు నమోదు చేసిన మూడో పట్టణ పోలీసులు ఆమెను కనిపెట్టి బుధవారం బంధువులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన మేరకు నందమూరి నగర్‌కు చెందిన వడ్డే దాక్షాయణి(30), ప్రదీప్‌కుమార్ దంపతులు. పిల్లలతో కలిసి వారు మంగళవారం ఐదో రోడ్డులోని బంధువులు భవానీ ఇంటికెళ్లారు. ప్రదీప్ కుమార్ తండ్రి చనిపోవడంతో బట్టలు పెట్టుకోవడానికి కర్ణాటకలోని బంధువుల ఇంటికెళ్తుండగా... దాక్షాయణి తానూ వస్తానని భర్తను కోరింది. అయితే ఆయన అందుకు ససేమిరా అన్నాడు. దీంతో ఉదయం నుంచీ బాధపడుతున్న ఆమె ఇంట్లోంచి రాత్రి 10 గంటలప్పుడు ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనపై ఫిర్యాదు రావడంతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు బృందాలుగా వెతికారు. ఆరు గంటల తర్వాత మహిళను కనిపెట్టి, తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి తర్వాత బంధువులకు అప్పజెప్పారు.

## శతజయంతిని జయప్రదం చేయాలి

కలెక్టర్ టీఎస్ చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

పుట్టపర్తి టౌన్, జూన్18(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను జయప్రదం చేయడానికి ప్రతిబక్షురూ కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సత్యసాయి శతజయంతి ఏర్పాట్లపై బుధవారం ఎస్పీ రత్న, జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సత్యసాయి శత జయంతి వేడుకలకు దేశవిదేశాల నుంచి పదిలక్షలమందికిపైగా భక్తులు, ప్రజలు పుట్టపర్తికి వచ్చే అవకాశం ఉందన్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి ఇప్పట్నుంచే ఏర్పాట్లు చేయాలన్నారు. పలువురు ప్రముఖులు హాజరవనున్న నేపథ్యంలో భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. చిత్రావతి నది సుందరీకరణ పనులు వేగం పెంచాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారధి, ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, జిల్లా వైద్యాధికారి ఫైరోజ్‌బేగం, తదితర అధికారులు పాల్గొన్నారు.

### యోగాంధ్రను విజయవంతం చేయాలి

ఈనెల 21న జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని ఆర్డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. యోగాంధ్ర కార్యక్రమం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

## సప్లిమెంటరీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న డైరెక్టర్ తదితరులు

అనంతపురంరూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలోని పలు సప్లిమెంటరీ ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్‌నాయుడు బుధవారం విడుదల చేశారు. బీటెక్ నాలుగో సంవత్సరం ఒకటో సెమిస్టర్(ఆర్20), (ఆర్19) (ఆర్15), బీఫార్మసీ ఫస్టియర్ రెండో సెమిస్టర్(ఆర్23), (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేశారు. ఆచార్య నాగప్రసాద్ నాయుడు మాట్లాడుతూ.. ఈఏడాది ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదల చేశామన్నారు. విద్యార్థులు ఫలితాల కోసం జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య శివకుమార్, ఆచార్య శంకర్‌శేఖర్ రాజు, డా. శ్రీధర్, డా.అంకారావు పాల్గొన్నారు.

# కేంద్ర పథకాల అమలులో వెనుకబాటు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

దిశ సమావేశంలో ఎంపీ అంబికా

అనంతపురం కలెక్టరేట్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొన్ని కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో వెనుకబడి ఉన్నామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో దిశ (జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీ అంబికా అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జేసీ శివ్‌నారాయణ్‌శర్మ, జడ్పీ సీఈఓ శివ శంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఆయా శాఖల జిల్లా అధికారులు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి కేంద్ర పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. పబ్లిక్ హెల్త్ శాఖ ద్వారా పట్టణాల్లో అమలు చేస్తున్న రక్షిత మంచి నీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి పలు కేంద్ర పథకాల అమలు వివరాలను అధికారులు వివరించారు. డీపీఆర్ స్టేజ్‌లో ఉన్న వివరాలు, నిధుల పెండింగ్ అంశాలు, అమలు చేస్తున్న వాటి పురోగతి వివరాలను అందించాలని ఎంపీ వారికి సూచించారు. అనంతపురం నగరాన్ని స్మార్ట్‌సిటీగా మార్చుకునే అవకాశముందని, కొన్ని పంచాయతీలను కలుపుకోవాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి ప్రస్తుత విలువతో ప్రతిపాదనలు తయారు చేసి పంపాలన్నారు. పీఎం ఫసల్ బీమా యోజన పట్ల రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నిరుద్యోగులకు కిసాన్ డ్రోన్స్ అందించి ఉపాధి కల్పించేలా చూడాలన్నారు. డ్రిప్ వినియోగంలో జిల్లా ప్రస్తుతం రెండో స్థానంలో ఉండగా, మొదటి స్థానంలోకి రావాలన్నారు. హామీ పథకంలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, పక్కాగా పనులు జరిగేలా చూడాలన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఇన్‌స్టాల్ చేసుకునేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గుంతకల్లు ప్రభుత్వాసుపత్రి అంబులెన్స్‌కు డ్రైవర్‌ను ఏర్పాటు చేయాలని, డయాలసిస్ ఉన్న ఆసుపత్రుల్లో జనరేటర్ సౌకర్యం వినియోగంలోకి తీసుకోవాలన్నారు. నార్పల, పామిడి బస్టాండ్ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఉరవకొండ నుంచి గుంతకల్లు మీదుగా విజయవాడకు బస్సు ఏర్పాటు చేయాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ భూసార పరీక్షలను కేటాయించిన లక్ష్యం మేరకు సాధించాలని సూచించారు. ఆర్థిక సంఘం నిధుల కింద జడ్పీకి ఇచ్చే 15శాతం నిధులు కొనసాగించేలా చూడాలని కోరారు. జేసీ శివనారాయణ్ శర్మ మాట్లాడుతూ రైతులను రుణాలను కట్టమని బలవంతం చేయకుండా ఆదేశాలు ఇచ్చామన్నారు. సమావేశంలో దిశా కమిటీ సభ్యులు గీతాంజలి, వన్నూరుస్వామి, రామ్మోహన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, నాబార్డు ఏజీఎం అనురాధ, పబ్లిక్‌హెల్త్ ఈఈ ఆదినారాయణ, సీపీఓ అశోక్‌కుమార్, హౌసింగ్ పీడీ శైలజ, డ్వామా పీడీ సలీం బాషా, డీసీహెచ్‌ఎస్ పాల్‌రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

# ఆగుతూ... సాగుతూ..

(5వ పేజీ తరువాయి)

లేక పనులు జాప్యంగా జరుగుతున్నట్లు చెబుతున్నారు.

### ఓ వైపు వర్షం.. మరోవైపు ఇంజనీర్ల నిర్లక్ష్యం

జిల్లాకు ప్రధాన నీటి వనరుగా ఉన్న తుంగభద్ర ఎగువకాలవ (టీబీపీ హెచ్చెల్సీ) కింద మూడు నెలల కిందట ప్రారంభించిన పలు అభివృద్ధి పనులకు వర్షం ఆటంకం కలిగిస్తోంది. అలాగే ఇంజనీర్ల నిర్లక్ష్యం కూడా తోడైంది. హెచ్చెల్సీ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 11పనులు చేయడానికి గుర్తించింది. ఇందుకోసం రూ.36 కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులు పూర్తయితే ప్రస్తుతం 1800క్యూసెక్కులుగా ఉన్న హెచ్చెల్సీ నీటి సామర్థ్యాన్ని 2500క్యూసెక్కులకు పెంచే అవకాశం ఉంటుంది. హెచ్‌ఎల్‌ఎంసీ ప్రధాన కాలువతో పాటు ఆయా ప్రాంతాల్లో చాలా చోట్ల కూలిపోయిన బ్రిడ్జిలు, అండర్ టన్నెల్, రెగ్యులేటర్లు మరమ్మతు నిర్మాణ పనులలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

### పనులు... నిధులు

రాష్ట్ర ప్రభుత్వం హెచ్చెల్సీలో అత్యంత ప్రాధాన్యమైన 11 పనులను చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన రూ.36కోట్లు నిధులను మంజూరు చేసింది. ఇందులో ప్రధానంగా హెచ్‌ఎల్‌ఎంసీ ప్రధాన కాలువ 165.028 కిలోమీటర్ వద్ద సగం పూర్తి అయిన బ్రిడ్జిని పూర్తి చేయడానికి రూ.1.59కోట్లు కేటాయించారు. 169.400 కిలోమీటర్ వద్ద వంతెన నిర్మాణానికి రూ.1.91కోట్లు, 155.81కిలోమీటర్ వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణానికి రూ.1.53కోట్లు, 115.167కిలోమీటర్ వద్ద వంతెన పూర్తి చేయడానికి రూ.1.66కోట్లు మంజూరు చేశారు. 117.794కిలోమీటర్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.80కోట్లు, 147.395కిలోమీటర్ వద్ద పెండింగ్‌లో ఉన్న అవుట్‌పాల్ రెగ్యులేటర్ పూర్తి చేయడానికి రూ.4.21కోట్లు, 137.702కిలోమీటర్ వద్ద అండర్ టన్నెల్ పునర్నిర్మాణానికి రూ.4.21కోట్లు మంజూరు చేశారు. 189.126కిలోమీటర్ వద్ద పీఏబీఆర్ లింకుచానల్ పునర్ నిర్మాణానికి రూ.4.10కోట్లు, 189.126 కిలోమీటర్ వద్ద ఎంపీఆర్ రెగ్యులేటర్ ఓటీ మోపిడి వద్ద రెగ్యులర్ నిర్మాణానికి రూ.4.14కోట్లు, 115 కిలోమీటర్ నుంచి 130కిలోమీటర్ వరకు లైనింగ్ నిర్మాణానికి రూ.9.80కోట్లు మంజూరు చేశారు. కణేకల్లు చెరువు ఒకటో కిలోమీటర్ వద్ద ఆఫ్‌టెక్ స్లూయిస్-3 నిర్మాణానికి రూ.22లక్షలు కేటాయించారు. చేపట్టిన పనులు ఇప్పటి వరకు కేవలం 30శాతం మాత్రమే పూర్తి చేశారు. వచ్చే సీజన్‌లోపు పనుల పూర్తిపై సందేహం నెలకొంది.




### ఇవి అత్యంత కీలకం

హెచ్చెల్సీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో 137.702 కిలోమీటరు వద్ద జరుగుతున్న అండర్‌టన్నెల్ నిర్మాణ పనులు సగం కూడా పూర్తి చేయలేదు. 147.395 కిలోమీటరు వద్ద అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ అత్యంత కీలకం. ఇది కూడా సగంలోనే ఉంది. 169.400కిలోమీటరు వద్ద జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు సగం పూర్తి అయ్యాయి. ఇలా ప్రాధాన్యం కలిగిన నిర్మాణ పనులు జూలై మూడో వారంలోపు పూర్తి చేస్తే టీబీ డ్యాం నుంచి నీటిని ఎక్కువగా తీసుకునేందుకు మార్గం సుగమమవుతుంది. హెచ్చెల్సీ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు కొంత దృష్టి సారించి పనులు పూర్తి చేయాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

### కొంత ఆలస్యం వాస్తవమే



హెచ్చెల్సీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులలో కొంత ఆలస్యమవుతున్న మాట వాస్తవమే. ఐదేళ్ల తరువాత హెచ్చెల్సీలో అత్యవసర పనులు గుర్తించి, నిధులు మంజూరు చేశారు. మొత్తం 11పనులకు సంబంధించి రూ.36కోట్లు నిధులు మంజూరు చేశారు. ఏడు నెలల్లో పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేపట్టినప్పటికీ ఓ వైపు వర్షాలు, మరోవైపు సాంకేతిక సమస్యలతో పనులు చేయడం కాస్త కష్టంగా మారింది. వచ్చే సీజన్‌లోపు పనులన్నీ పూర్తి చేయాలని సూచించాం. హెచ్చెల్సీకి రెగ్యులర్ ఎస్‌ఈ లేకపోవడం కొంత మేర ఇబ్బంది పెట్టే అంశమే. జూలై నెలలోపు ప్రభుత్వం సూచించిన పనులను పూర్తి చేసి, కాలవ పటిష్ఠతకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీర్లకు ఆదేశాలిచ్చాం. ఆ మేరకు పనులు జరుగుతున్నాయి.

- నాగరాజు, జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ

# దిద్దుపాట్లు!

టీచర్ల బదిలీల్లో పొరపాట్లను సరిచేసేందుకు కుస్తీ



కుస్తీ పడుతున్న డీఈఓ, ఏడీ తదితరులు

అనంతపురం విద్య, జూన్ 18(ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీల్లో సమస్యలు, పొరపాట్లను సరిదిద్దేందుకు విద్యాశాఖ కుస్తీ పడుతోంది. బదిలీల్లో కోరుకున్న పాఠశాలలో ఖాళీలు లేకపోవడం, కోరుకున్న ప్లేస్‌లో ఇతరులకు ఉత్తర్వులు రావడం వంటివి జరిగాయి. దీంతో బాధిత టీచర్లు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. పొరపాట్లపై రాష్ట్ర ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 18లోగా పొరపాట్లను సరిదిద్దాలని, పరిష్కారం కాకపోతే రాష్ట్ర కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ మునీర్, ఐటీసెల్ ఏపీఓ మంజునాథ్ తదితరులు పొరపాట్లను సరిదిద్దేందుకు కుస్తీ పడుతూ వచ్చారు. మూడురోజులుగా డీఈఓ ఆఫీసుకు వచ్చిన టీచర్ల సమస్యలు వింటూ, వారికి నచ్చచెబుతూ మరో స్థానం చూపుతూ వస్తున్నారు. పొరపాట్ల దిద్దుబాటుకు జిల్లా స్థాయిలో బుధవారం ఆఖరి రోజు కావడంతో బాధితులకు ఫోన్‌లు చేసి, కేటాయించిన ప్లేస్‌లను చెబుతూ బుజ్జగించారు. అయినా దాదాపు పదికి పైగానే సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వాటిని రాష్ట్రశాఖకు పంపించినట్లు తెలిసింది.

## నేటి నుంచి టీ20 క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి అనంతపురం క్రికెట్ స్టేడియంలో సౌత్‌జోన్ సీనియర్ టీ20 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. జిల్లా సీనియర్ టీ20 జట్టుకు వినయ్‌కుమార్, గిరినాథ్‌రెడ్డి, అర్జున్‌టెండూల్కర్, దత్తారెడ్డి, రాజు కుళ్ళాయప్ప, మహేంద్రరెడ్డి, సంపత్‌కుమార్, సంతోష్, రోహిత్‌రోషన్, మల్లికార్జున, మహ్మద్‌కమిల్, దీపక్, మహబూబ్‌పీరా, ప్రదీప్‌రెడ్డి, వీరారెడ్డి, చైత్రవర్ధన్‌లు ఎంపికయ్యారు. స్టాండ్‌బైలుగా ప్రమోద్, ప్రశాంత్, భానుప్రకాష్, లోహిత్‌సాయి కిశోర్, వికాస్‌లు నిలిచారు. టీ20 టోర్నీలో అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు ఐదు జట్లు పాల్గొంటాయన్నారు. గురువారం కడప-కర్నూలు, అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య పోటీలు జరుగుతాయన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కదిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక జెండా వీధిలో నివాసముంటున్న షేక్ జిలానీ (39) విద్యుదాఘాతంతో బుధవారం మృతిచెందాడు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిలానీ బేల్దారి పని చేస్తుండేవాడు. బుధవారం మధ్యాహ్నం చౌక్ జంక్షన్ వద్ద కాలువ కనిపించకుండా ఇనుక కడ్డీలు అమర్చి, బండలు వేసే సమయంలో ప్రమాదవశాత్తు డ్రిల్లింగ్ మిషన్‌కు అమర్చిన వైరు తగిలి జిలానీ షాక్‌కు లోనయ్యాడు. దీంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. దీనిపై జిలానీ భార్య ఫర్హానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, శవాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సీఐ వివరించారు.

### గోరంట్లలో రైతు...

హిందూపురం(గోరంట్ల), జూన్ 18(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలంలోని కొత్తపల్లికి చెందిన రైతు నరేష్(40) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఎప్పటిలాగే బుధవారం పొలం వద్దకు మోటారు ఆన్ చేయడానికి వెళ్లాడు. అయితే స్టార్టర్‌ను ముట్టుకోగానే విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరేష్ వ్యవసాయం చేస్తూ టీడీపీలో చురుగ్గా ఉండేవాడు.

## రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి, జూన్18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ మూడో ప్లాట్‌ఫాం వద్ద రైలు కింద పడి నంద్యాల జిల్లాకు చెందిన విశ్వేశ్వరరెడ్డి (29) బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం యర్రగుడి గ్రామానికి చెందిన దస్తగిరిరెడ్డి కుమారుడు విశ్వేశ్వరరెడ్డి కొంతకాలంగా వ్యసనాలకు బానిసయ్యాడు. క్రికెట్ బెట్టింగులు, ఆన్‌లైన్ జూదం ఆడి అప్పులపాలయ్యాడు. వాటిని తీర్చే మార్గంకానరాక మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే తాడిపత్రికి వచ్చి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

### ఉద్యోగం రాలేదని..

బుక్కరాయసముద్రం, జూన్18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాలేదని శివరాజ్ (21) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుక్కరాయసముద్రంలో జరిగింది. బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన సంగమేశ్ కూలి పని చేసుకుని జీవనం సాగించేవాడు. ఇతడి కుమారుడు శివరాజ్ (21) డిగ్రీ పూర్తి చేశాడు. రెండేళ్ల నుంచి పలుచోట్ల ఉద్యోగాల కోసం ప్రయత్నించినా ఎక్కడా ఉపాధి అవకాశాలు రాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

హిందూపురం/కళ్యాణదుర్గం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని దొడ్డబళ్లాపురం సమీపంలో రైలు ఢీకొని సురేంద్రనాయుడు(36) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడిది కంబదూరు మండలం డీ చెన్నేపల్లి గ్రామం కాగా గత పదేళ్ల నుంచి హిందూపురం త్యాగరాజ్‌నగర్‌లో నివాసముంటున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి రైల్వే ట్రాక్ దాటే సమయంలో గుర్తుతెలియని రైలు ఢీకొన్నట్లు తెలిపారు. ఈమేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## ద్విచక్రవాహనం నుంచి పడి వ్యక్తి మృతి


రమేష్ (ఫైల్)

బత్తలపల్లి, జూన్18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంపెట్ల గ్రామ శివారులో బుధవారం ద్విచక్రవాహనం నుంచి జారిపడి రమేష్ (39) మృతిచెందాడు. ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దంపెట్ల గ్రామానికి చెందిన వెంకటస్వామి కుమారుడు రమేష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. రమేష్‌ను అతడి అన్న వెంకటనారాయణ ద్విచక్రవాహనంలో కూర్చోబెట్టుకుని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి బయల్దేరాడు. గ్రామ శివారులో వెనుక కూర్చున్న రమేష్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తమ్ముడు వెంకటగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

## గిరిజన నాయకుల రాజీనామా


రాజీనామా పత్రాలను అందజేస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజాసమాఖ్య (జీపీఎస్), గిరిజన విద్యార్థి సమాఖ్య (జీవీఎస్)ల ఉమ్మడి జిల్లా నాయకులు మూకుమ్మడి రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన సమావేశంలో జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, జాతీయ సలహాదారులు నారాయణస్వామి నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు నాయక్, రాయలసీమ యువజన అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, హిందూపురం పార్లమెంట్ జీవీఎస్ అధ్యక్షుడు శీనానాయక్, అనంతపురం అధ్యక్షుడు రమేష్‌నాయక్, ఉపాధ్యక్షులు శివానాయక్, బాబు నాయక్, మహిళావిభాగం అధ్యక్షురాలు శోభాబాయి, కార్యదర్శి సుమతి తమ రాజీనామా పత్రాలను జీపీఎస్ జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్‌కు పంపినట్లు తెలిపారు. గత 20ఏళ్లుగా గిరిజనుల కోసం పనిచేశామని, అయితే స్వార్థ పరులైన నాయకుల వ్యవహారశైలి నచ్చకనే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పూర్తి కమిటీలు రద్దు చేసినట్లు తెలిపారు. తమ నాయకుడు ఒక పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారన్న అసంతృప్తితో రాజీనామా చేశామన్నారు.



# ఏం పనులు చేశారో చెప్పండి..?

### అధికారులను ప్రశ్నించిన కేంద్ర బృందం

### ఉపాధి నిధులతో చేసిన పనులపై ఆరా


సోదనపల్లిలో లోతు దుక్కిని పరిశీలిస్తున్న కేంద్రబృందం సభ్యులు

అనంతపురం అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి నిధులతో ఏఏ పనులు చేశారో చెప్పాలని డ్వామా, వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులను జాతీయ స్థాయి పర్యవేక్షణ కమిటీ బృందం సభ్యులు నవనీతదాస్, వెంకటేశ్వరన్ ప్రశ్నించారు. జిల్లా పర్యటనకు వచ్చిన కమిటీ సభ్యులు బుధవారం స్థానిక డ్వామా సమావేశపు హాల్‌లో డ్వామా, వ్యవసాయ, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఐసీడీఎస్, మత్స్యశాఖ, భూగర్భజల శాఖ, అటవీ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ సలీం బాషా జిల్లాలో ఉపాధి హామీ నిధులతో ఆయా శాఖల్లో చేపట్టిన పనులను కమిటీ సభ్యులకు వివరించారు. గురువారం నుంచి ఈనెల 21వతేదీ దాకా బృందం సభ్యులు ఎంపిక చేసిన ప్రాంతాల్లో పర్యటించి, ఉపాధి నిధులతో చేపట్టిన పనులను పరిశీలిస్తారన్నారు. యల్లనూరు మండలం చింతకాయమంద, మల్లాగుండ్ల గ్రామ పంచాయతీలు, అనంతపురం రూరల్, కందుకూరు పంచాయతీల్లో కమిటీ సభ్యులు పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయాప్రాంతాల్లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులు, వాటి ప్రయోజనాలపై స్థానిక లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడతారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### నీటి నిల్వ పనులపై సంతృప్తి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాటర్ షెడ్ ద్వారా నీటిని నిల్వ చేసేందుకు చేపట్టిన పనులను జలశక్తి కేంద్ర బృందం సభ్యులు శంకర్, గౌతమ్ బుధవారం పరిశీలించారు. ఆయా పనుల కోసం ఖర్చు చేసిన నిధులపై ఆరా తీశారు. డ్వామా వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి బృందం సభ్యులకు వాటర్ షెడ్ ద్వారా నీటి నిల్వ చేసేందుకు చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధుల వివరాలను వివరించారు. నీటి నిల్వ కోసం చేపట్టిన పనులపై బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత శింగనమల మండలం సోదనపల్లి, పెరవలి గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యకలాపాలను పరిశీలించారు. ఆ తర్వాత తాడిపత్రిలో మురుగునీటి శుద్ధి కర్మాగారాన్ని పరిశీలించి, వాటి నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం తాడిపత్రిలోని ఆలూరులో చెక్ డ్యాంలు, మెషిన్ ఫాంపాండ్స్‌ను పరిశీలించారు. సాయంత్రం గార్లదిన్నె మండలంలో ఇంకుడు గుంతలు, ఫారంపాండ్స్, మిద్దెపై పడిన వర్షపు నీటిని సేకరించే పద్ధతిని పరిశీలించారు.

### రెండోరోజు పర్యటన వివరాలిలా..

జలశక్తి కేంద్ర బృందం సభ్యులు గురువారం రెండోరోజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. కూడేరు మండలంలోని పీఏబీఆర్ డ్యామ్‌ను పరిశీలిస్తారు. ఆ తర్వాత ఆత్మకూరు, కళ్యాణదుర్గం మండలాల్లో పర్యటిస్తారు. మధ్యాహ్నం రాయదుర్గం మండలంలో పలు రకాల పనులను పరిశీలిస్తారు.

## జీవిత ఖైదీలకు స్వేచ్ఛ

### ఉమ్మడి జిల్లాలో ఐదుగురి విడుదల


అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు నుంచి విడుదల అవుతున్న నలుగురు ఖైదీలతో జైలు అధికారులు


పెనుకొండ సబ్ జైలు నుంచి విడుదలైన సురేష్ బాబు

బుక్కరాయసముద్రం/పెనుకొండ టౌన్, జూన్ 17(ఆన్‌లైన్): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి జిల్లాలో ఐదుగురు జీవిత ఖైదీలు జైలు నుంచి బుధవారం విడుదలయ్యారు. అనంతపురం ఓపెన్‌ఎయిర్ జైలు నుంచి నలుగురు, పెనుకొండ సబ్ జైలు నుంచి ఒకరు క్షమాభిక్షపై బయటకు వచ్చారు. వీరిలో నలుగురు హత్య కేసులో, ఒకరు వరకట్నం కేసులో శిక్ష అనుభవించారు. అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు నుంచి విడుదల అయినవారిలో ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలానికి చెందిన మద్దిరాల రాంబాబు(50), వైఎస్సార్ జిల్లా తొండూరు మండలం గొట్లూరు గ్రామానికి చెందిన దొంతిరెడ్డి పౌల్ రెడ్డి (54), కడప అర్బన్‌ను చెందిన షేక్ బాబా ఫక్రుద్దీన్ (51), పొట్టి శ్రీరాములు నెలూరు జిల్లా కేంద్రానికి చెందిన బండల చంద్ర (41) ఉన్నారని జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ షఫివుర్ రెహమాన్ తెలిపారు. పెనుకొండ సబ్ జైలు నుంచి జీవిత ఖైదు అనుభవిస్తున్న సురేష్ బాబు విడుదలయ్యారు. చెన్నైకి చెందిన సురేష్ బాబు వివాహం అనంతరం తిరుపతిలో ఉండేవారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య మృతిచెందడంతో నమోదైన వరకట్నం కేసులో 17 ఏళ్లపాటు శిక్ష అనుభవించారు. ఇంటర్ చదువుతున్న తన కుమారుడు, కూతురు భవిష్యత్తు కోసం ఇక ఏదో ఒక పని కష్టపడి చేసుకుంటానని సురేష్ బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆన్‌లైనా..? ఆఫ్‌లైనా..?

### సచివాలయ సిబ్బంది బదిలీలపై సందిగ్ధత

### ఎంపీడీఓల లాగిన్ నుంచి అప్‌లోడ్ కాని దరఖాస్తులు

### కొరవడిన స్పష్టత

### కార్యాలయాల చుట్టూ ఉద్యోగుల ప్రదక్షిణ

అనంతపురం న్యూటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సచివాలయాల సిబ్బంది బదిలీలపై సందిగ్ధం నెలకొంది. ఆఫ్‌లైన్ నిర్వహిస్తారా..? ఆన్‌లైన్‌లో చేస్తారా అన్నదానిపై స్పష్టత కరువైంది. దీంతో సిబ్బంది అయోమయంలో పడ్డారు. ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్‌కు అనుగుణంగా సర్వర్ పనిచేయట్లేదు. ఈనెల 16 నుంచి 18వతేదీ వరకు వివరాల నమోదుకు అవకాశం కల్పించారు. 22 నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో బదిలీల అభ్యర్థనకు అవకాశం కల్పించారు. 25నుంచి 29వ తేదీ వరకు వాటిని పరిశీలించనున్నారు. 30న కలెక్టర్ బదిలీల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఉత్తర్వులు వచ్చాయి. వివరాల నమోదుకు సర్వర్ ఓపెన్ కాకపోవడంతో ఉద్యోగులు అయోమయంలో పడ్డారు. సంబంధిత అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కొన్ని విభాగాల్లో సంబంధిత అధికారులను సంప్రదించి బెర్తు ఖరారు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. రిక్వెస్ట్ బదిలీలు మాత్రమే ఆన్‌లైన్‌లో చేస్తారనీ, ఐదేళ్లు పూర్తయిన వారికి ఆఫ్‌లైన్ ద్వారానే చేసే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

## వైద్యశాఖలో బదిలీల సందడి

### కొనసాగుతున్న కౌన్సెలింగ్


ఏఎన్ఎంల బదిలీలు చేపడుతున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో బదిలీల సందడి నెలకొంది. వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజనాస్పత్రి, జిల్లా వైద్యాధికారి కార్యాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంల నుంచి ప్రొఫెసర్ల వరకు స్థానచలనం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 161 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారని అధికారులు తెలిపారు. 25 కేడర్లలో 500 మంది వరకు తప్పనిసరిగా బదిలీ కావాల్సిన లిస్టులో ఉన్నారు. మరో వందమంది వరకు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నారు. జూమ్ మీటింగ్ ద్వారా ఉద్యోగులు హాజరై, ఆప్షన్లు ఇచ్చుకుంటున్నారు. బదిలీల ప్రక్రియ శనివారం వరకు కొనసాగే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. బదిలీ అయిన వారికి ఈనెల 23లోపు ఉత్తర్వులు జారీ చేస్తారని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

### లైబ్రేరియన్ పోస్టు ఖాళీ

వైద్య కళాశాలలోని కేంద్ర గ్రంథాలయ లైబ్రేరియన్ పోస్టు ఖాళీ పడనుంది. అక్కడ పనిచేస్తున్న రామేశ్వరి.. రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకోవడంతో కర్నూలుకు బదిలీ అవకాశం కల్పించారు. లైబ్రేరియన్, అసిస్టెంట్ లైబ్రేరియన్‌తోపాటు నలుగురు సహాయక ఉద్యోగులు సెంట్రల్ లైబ్రరీలో పనిచేస్తున్నారు. లైబ్రేరియన్ మినహా అందరూ ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. రామేశ్వరి బదిలీతో సెంట్రల్ లైబ్రరీలో రెగ్యులర్ ఉద్యోగులు ఉండరని కళాశాల అధికారులు పేర్కొన్నారు.

### కొందరు లక్కీ..

నిబంధనలకు మేరకు కాలపరిమితి పూర్తయినవారు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందేనని రాష్ట్ర వైద్య శాఖ ఆదేశాలు జారీచేసింది. ఆ మేరకు వివరాలు క్రోడీకరించి ఉద్యోగులను అధికారులు బదిలీ చేస్తున్నారు. మెడికల్ గ్రౌండ్స్, ఎంప్లాయిస్ అసోసియేషన్, స్పౌజ్ తదితర వెసులుబాటు ఉన్న వారిని ప్రస్తుత స్థానంలో కొనసాగిస్తున్నారు. బదిలీ అవ్వాల్సిన కొంతమంది ఉద్యోగులకు అదృష్టం వరించినట్లుంది. ప్రస్తుత స్థానం నుంచి బదిలీ కావాలంటే క్లియర్ వెకేన్సీలు, పోస్టింగులు ఎక్కడా దొరకడంలేదు. దీంతో వారందరూ ప్రస్తుత స్థానంలోనే కొనసాగుతారని అధికారులు పేర్కొంటున్నారు.

కేడర్ల వారీగా బదిలీలు ఇలా..

| కేడర్ | బదిలీ అయినవారి సంఖ్య |
|---|---|
| ప్రొఫెసర్లు | 2 |
| అసోసియేట్ ప్రొఫెసర్లు | 6 |
| ల్యాబ్ టెక్నీషియన్లు | 12 |
| జూనియర్ అసిస్టెంట్లు | 7 |
| ఎల్‌డీ, కంప్యూటర్స్ | 8 |
| టైపిస్టులు | 4 |
| ఏఎన్ఎం | 122 |
| మొత్తం | 161 |

## అర్ధాంతరంగా బదిలీల నిలుపుదల

### వైద్యశాఖ ఆర్డీ రామగిడ్డయ్య

అనంతపురం వైద్యం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖలో చేపట్టిన బదిలీల ప్రక్రియను అర్ధాంతరంగా నిలుపుదల చేస్తున్నట్లు రీజనల్ డైరెక్టర్(ఆర్డీ) రామగిడ్డయ్య బుధవారం తెలిపారు. హంస సిఫార్సులను బదిలీల్లో పరిగణనలోకి తీసుకోకూడదంటూ ఇతర సంఘాల నాయకులు.. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో హంస తాత్కాలిక గుర్తింపును నిలుపుదల చేశారన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత బదిలీల్లో హంస కార్యవరంలోని ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వలేదన్నారు. తమకు న్యాయం చేయాలని హంస కార్యవర్గం న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో గుర్తింపును కొనసాగిస్తూ ఉత్తర్వులిచ్చిందన్నారు. ఆ మేరకు మినహాయింపునిచ్చేలా బుధవారం నిర్వహించిన అన్ని కేడర్ల బదిలీలను పునఃపరిశీలిస్తామన్నారు. గురువారం నుంచి చేపట్టే బదిలీల్లో మినహాయింపును వర్తింపజేస్తామని తెలిపారు. కోర్టు తీర్పుపై హంస నాయకులు షఫీ, వేణుగోపాల్, రాఘవేంద్రరెడ్డి, అనిల్‌నాయక్, నల్లప్ప, విజయప్రసాద్ హర్షం వ్యక్తంచేశారు.

## ఉన్నత పాఠశాలలో చోరీకి యత్నం

### సైకిళ్లు ఉంచిన గది తాళాలను పగులగొట్టిన దుండగులు


తరగతి గది గ్రిల్ తాళాలను పగులగొట్టిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సైకిళ్ల చోరీకి గురుతెలియని దుండగులు యత్నించారు. ఉన్నత పాఠశాలలోకి మంగళవారం రాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి, సైకిళ్లు ఉంచిన గది తాళాలను పగులగొట్టారు. అందులోని ఓ సైకిల్‌ను బయటకు తీసుకొచ్చి ప్రార్థనా ప్రాంగణం వద్ద పడేసి వెళ్లారు. మొత్తం 155 సైకిళ్లు ఉండగా.. ఒక్కటి కూడా ఎత్తుకెళ్లలేదు. ఎస్‌ఐ సత్యనారాయణ పాఠశాలను పరిశీలించి, హెచ్ఎం ఓబుళమ్మను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇది ఆకతాయిల పనా, దొంగలే ప్రయత్నించి ఉంటారా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

## హృషికేశ్‌కు ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి యశ్వంతపూర్-యోగ్ నగరి హృషికేశ్‌కు అప్ అండ్ డౌన్ సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. యశ్వంతపూర్-హృషికేశ్ (06597) ప్రత్యేక రైలు ఈ నెల 19న (గురువారం) యశ్వంతపూర్‌లో ఉదయం 7 గంటలకు బయలుదేరి 21 ఉదయం 10-20 గంటలకు హృరిషికేశ్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు ప్రత్యేక రైలు (06598) హృషికేశ్‌లో 21 సాయంత్రం 5-55 గంటలకు బయలుదేరి 23 సాయత్రం 7-45 గంటలకు యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, డోన్, కర్నూల్ సిటీ, కాచిగూడ, ఖాజీపేట్, బాలార్షా, నాగపూర్, భోపాల్, బీనా, వీరాంగన లక్ష్మీబాయ్ ఝాన్సీ, గ్వాలియర్, ఆగ్రా కంటోన్మెంటు, మధుర, హజ్రత్ నిజాముద్దీన్, ఘజియాబాద్, మీరట్ సిటీ, ముజఫ్ఫర్‌నగర్, తాప్రి, రూర్కీ, హరిద్వార్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

## జడ్పీ సీఈఓ శివశంకర్ బాధ్యతల స్వీకరణ

అనంతపురం న్యూటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈఓగా శివశంకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సీఈఓగా పనిచేస్తున్న రామచంద్రారెడ్డిని సరండర్ చేశారు. దీంతో డ్వామాలో ధర్మవరం ఏపీడీగా పనిచేస్తున్న శివశంకర్‌ను జడ్పీ సీఈఓగా నియమించారు. ఆయన జడ్పీ కార్యాలయంలోని సీఈఓ చాంబర్‌లో బాధ్యతలు తీసుకున్నారు. మంగళవారం సాయంత్రమే కలెక్టర్ వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మను కలిశారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

## 27 నుంచి గూగూడు బ్రహ్మోత్సవాలు

నార్పల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ ఈఓ శోభ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న స్వామి వారి ప్రథమ దర్శనం, 28న స్వామి వారి నిత్యపూజ నివేదన, 29న స్వామి వారి అగ్నిగుండము ఏర్పాటు చేయుట, స్వామి వారిని నిలుపుట, జూలై 1న స్వామి వారి నిత్యపూజ నివేదన, 2న స్వామి వారి చిన్నసరిగెత్తు, 3న స్వామి నిత్యపూజ నివేదన, 4న స్వామి వారి ఏడో చిన్నసరిగెత్తు, రాత్రికి దేవుని మెరవణి, 5న నిత్యపూజ నివేదన విడిదినము, 6న స్వామి వారి గ్రామోత్సవం, పెద్దసరిగెత్తు రాత్రికి దేవుడి మెరవణి, అగ్నిగుండం ప్రవేశం, 7న అగ్నిగుండ ప్రవేశం, జలధి కార్యక్రమం, 9న స్వామి వారి చివరి దర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

## చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురంరూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.30వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.2,500, సరాసరి రూ.17వేలతో అమ్ముడుపోయాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 494టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

## లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న బయాలజీ, ఎకనామిక్స్ లెక్చరర్ పోస్టులకు దరకాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతిర్లత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎంపిక చేస్తామన్నారు.

## జిల్లా మేదర సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు


సమావేశంలో పాల్గొన్న నాయకులు

అనంతపురం క్లాక్ టవర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా మేదర సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. స్థానిక మల్లాలమ్మ ఆలయంలో జిల్లా మేదరసంఘం కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ రంగయ్య, ఎలక్షన్ ఆఫీసర్ వీరభద్రయ్య, మేదర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, గౌరవాధ్యక్షులు వేణుగోపాల్, కేఎం వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌ల సమక్షంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా మేదర సంఘం అధ్యక్షుడుగా పోలేపల్లి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌కుమార్, కోశాధికారిగా వెంకటరాముడు, ప్రచార కార్యదర్శిగా పోతుల రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఏడాదిలో పదో తరగతిలో 500 మార్కులు, ఇంటర్‌లో 900మార్కులపైన వచ్చిన మేదర విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని కార్యవర్గ సభ్యులు తెలిపారు. పేద మేదర విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, ఇతర విద్యాసామగ్రి పంపిణీ చేస్తామని అన్నారు. మేదరలను ఎస్టీలుగా గుర్తించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు.




పీవీకేకేలో యోగాసనాలు వేస్తున్న పల్లె కిశోర్, ఎమ్మెల్యేలు పల్లె సింధూర, దగ్గుపాటి ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, శింగనమలలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఆలం తదితరులు

# యోగాతో ఒత్తిడి దూరం

●యోగాంధ్రలో ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): యోగాతో ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత లభిస్తుందని పుట్టపర్తి, అనంతపురం అర్బన్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. ఆలమూరు రోడ్డులో గల పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యేలతో



ఎమ్మెల్యే దగ్గుపాటి ధ్యాన ముద్ర

పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె వెంకట కృష్ణకిశోర్‌రెడ్డి పాల్గొన్నారు. యోగా మాస్టర్లు వారితో యోగాసనాలు వేయించారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. యోగాతో ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత లభిస్తుందని, కనుక ప్రతి ఒక్కరూ యోగా అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21న ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో విశాఖపట్నంలో 5లక్షల మందితో యోగా డే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇది ప్రపంచ రికార్డుగా చరిత్ర సృష్టించనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

**అలవాటు చేసుకోవాలి: బండారు శ్రావణిశ్రీ**

శింగనమల: ప్రతిఒక్కరూ నిత్యం యోగా చేయడం అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. శింగనమలలోని జడ్పీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని ఆమెతో పాటు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి కే.రామలింగారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆర్డీఓ కేశవనాయుడు ఎస్ఎస్ఏ అధికారి శైలజ, తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, సీడీపీఓ లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

**యోగాపై శిక్షణ**

రామగిరి మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు యోగాపై ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. యోగాడేను పురస్కరించుకుని ఈనెల 21న పెద్దఎత్తున యోగాసనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. కొత్తగాదికుంటలో బుధవారం అన్నం అరవిందు అనే ఉపాధ్యాయుడు విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. యోగా వల్లకలిగే ఉపయోగాల గురించి వివరించారు.

# తల్లుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది

● తల్లికి వందనం దేశ చరిత్రలో నిలిచిపోతుంది ● విద్యామిత్ర కిట్ల పంపిణీలో ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనంతో విద్యార్థుల తల్లుల కళ్లల్లో ఆనందం వెల్లువిరుస్తోందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలకేంద్రంలోని మోడల్ స్కూల్లో విద్యార్థులకు బుధవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్రకిట్ల పంపిణీని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు, వారి తల్లులతో కలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖా మంత్రి నారాలోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశారు. త ర్వాత సమావేశంలో మాట్లాడుతూ.. తల్లికివందనం పథకం ద్వారా లబ్ధి పొందిన తల్లుల కళ్లల్లో ఆనందం వెల్లువిరుస్తోందన్నారు. ఎంతమంది చదువుకునే పిల్లలుం టే అంతమందికీ వర్తింపజేయడం వల్ల ఈ పథకం దేశచరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. నియోజకవర్గంలో తల్లికివందనం కింద తల్లుల ఖాతాల్లో రూ.36కోట్ల నగదు జమైందని, అదే విధంగా విద్యాకిట్లకు మరో రూ.5కోట్లు కలిపి మొత్తం రూ.41కోట్లు ప్రభుత్వం వెచ్చిందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో దేవాలయాల్లాంటి పాఠశాలల్లో రాజకీయాలకు తెరలేపారన్నారు. పిల్లలకు ఇచ్చే స్కూల్ బ్యాగులు, నోటుపుస్తకాలపై జగన్ ఫొటోలు వేయించుకున్నారని దుయ్యబట్టారు. అదే తమ నాయకుడు చంద్రబాబు విద్యావేత్త అయిన సర్వేపల్లిరాధాకృష్ణన్ పేరుతో విద్యామిత్రకిట్లను అందిస్తున్నారని తెలిపారు. అనంతరం ఆమె అక్కడి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం సన్నబియ్యంను సరఫరా చేస్తోందని , విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో నిర్లక్ష్యం చూపరాదని ఏజెన్సీ



సీకేపల్లి మోడల్ స్కూల్లో విద్యామిత్ర కిట్లను పంపిణీ చేస్తున్న పరిటాల సునీత

నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్, కేజీబీవీ ప్రిన్సిపాళ్లు స్వర్ణలత, సువర్ణ, ఎంఈఓ-1 మున్వర్‌బాషా, ఎస్ఎంసీచైర్మన్ నాగరత్నమ్మ, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీఓ బాలకృష్ణుడు, ఈఓఆర్డీ అశోక్‌నాయక్, టీడీపీ సీనియర్‌నాయకులు ఎల్.నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

**విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి..**

శింగనమల: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఆమె విద్యా మిత్ర కిట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించడానికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. అంతకు మునుపు స్థానికంగా బాలికల వసతి గృహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ అధికారి శైలజ, ఎంఈఓ నరసింహరాజు, పాఠశాల కమిటీ చైర్మన్ సురేష్‌కుమార్, పలువురు అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## రూడ్‌సెట్‌లో కంప్యూటర్ ట్యాలీలో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్ సంస్థలో ఈనెల 21 నుంచి జులై 28వతేదీ వరకు 38రోజుల పాటు నిరుద్యోగ మహిళలకు కంప్యూటర్ ట్యాలీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి బుధవారం ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు వయసు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉన్న గ్రామీణ ప్రాంత మహిళలు అర్హులన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఎస్కేయూ సమీపంలోని రూడ్‌సెట్ కార్యాలయంలో నేరుగాగానీ, 9618876060 నంబరులోగానీ సంప్రదించాలని కోరారు.

## రాప్తాడులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తాం



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో త్వరలో అన్న క్యాం టీన్‌ను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. స్థానిక జాతీయరహదారి పక్కన పాత ఆస్పత్రి వద్ద అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని బుధవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ అన్న క్యాంటీన్ ఏర్పాటుకు రూ.65 లక్షల నిధులను సీఎం చంద్రబాబు మంజూరు చేయించారన్నారు. త్వరలోనే ఏర్పాటు చేసి పేదలకు రూ. 5లకే భోజనం అందిస్తామని అన్నారు. తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచ్ తిరుపాలు, టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కిష్టా, నాయకులు పాల్గొన్నారు.

## బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

రామగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలికివాండ్లపల్లి గ్రామానికి చెందిన ముసలప్ప, ముత్యాలమ్మ దంపతులు వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురంలోని సవేరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. తర్వాత ఆర్థికసాయం అందజేశారు.

## ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

గార్లదిన్నె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పామిడి, కొండురు పెన్నా పరివాహక ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. గత మూడు రోజుల నుంచి సుమారు 9 ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వాటిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు.

## ఆర్డీటీ లబ్ధిదారుల్లో చైతన్యం రావాలి

అనంతపురం వైద్యం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో పేదల సంక్షేమానికి ఎంతో కృషి చేసిన ఆర్డీటీ సేవలను కొనసాగించేలా లబ్ధిదారుల్లో చైత్యనం తీసుకువచ్చేందుకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లాయర్ నారాయణప్ప తెలిపారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన చైతన్య ర్యాలీల్లో భాగంగా బుధవారం చీకలుగురికిలో కొవ్వత్తుల ప్రదర్శన చేపట్టామన్నారు. నాయకులు మహేశ్వరి, గోపాల్, చంద్రశేఖర్, ఆనందరాజు తదితరులు పాల్గొన్నట్లు చెప్పారు.

## అత్యాచారం చేసినవారిని కఠినంగా శిక్షించాలి

● బీఎస్పీ నాయకుల డిమాండ్

చెన్నేకొత్తపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలంలోని ఓగ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని బహుజన సమాజ్ పార్టీనాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించేందుకు వెళ్తున్న నాయకులను శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఎన్ఎస్ గేటులో అడ్డుకుని వెళ్లడానికి అనుమతి లేదంటూ స్టేషన్‌కు తరలించారు. అక్కడ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గద్దల నాగభూషణం, నాగరాజు, జిల్లా అధ్యక్షుడు కాసాని నాగరాజు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, అదే విధంగా ఈ కేసులో నిందితులందరినీ వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరాజు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కుళ్లాయప్ప, నాయకులు నాగసుబ్బరాయుడు, హరిప్రసాద్, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



సీకేపల్లి పోలీస్‌స్టేషన్‌లో బీఎస్పీ నాయకులు

## ప్రమాదాల నియంత్రణ మన చేతుల్లోనే: ఆర్టీఓ



నో డ్రగ్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆర్టీఓ తదితరులు

అనంతపురం టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం మనచేతుల్లోనే ఉంటుందని ఆర్టీఓ సురేష్ నాయుడు తెలిపారు. నగరంలోని ఆర్టీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆ ర్టీఓ సురేష్ నాయుడుతోపాటు డీఎంహెచ్ఓ ఈబీదేవి, ఆర్ఎస్ఐ హనుమంతు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ... వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించరాదన్నారు. ప్రతిఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ మన చేతుల్లోనే ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ అప్రమత్తం గా వ్యవహరిస్తే ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉండదన్నారు. అనంతరం ఆర్టీఓ కార్యాలయ సిబ్బందితోపాటు ప్రజాపిత బ్రహ్మకుమారీలు యోగాసనాలు వేశారు. తర్వాత నో డ్రగ్స్ బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అనంతపురం ప్రతినిధి శారద, కల్యాణదుర్గం ఆర్టీఓ రమేష్, అనంతపురం ఎంవీఐ శ్రీనివాసులు, ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బోధనేతర సిబ్బందిని నియమించాలని వినతి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బందిని నియమించాలని ఉపాధ్యాయసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ బాలస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలో ఏడు ఉన్నత పాఠశాలల్లో ఉన్నాయని, ఈ విద్యాసంవత్సరం మరో నాలుగు ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించారని, మొత్తం 11ఉన్నత పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. కొత్తగా ఉన్నతీకరించిన పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని నియమించకపోవడంతో విద్యార్థుల అడ్మిషన్లు, టీసీలు ఇవ్వడం వంటి కార్యక్రమాలకు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ ఉపాధ్యాయుల కన్వీనర్ ఫణిభూషణ్, ఎస్టీయూ సీనియర్ నాయకులు జనార్ధన్, యుగంధర్, నాగభూషణం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మరూరులో పొలం పిలుస్తోంది

రాప్తాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరు గ్రామంలో బుధవారం ఏఓ కృష్ణ చైతన్య పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ పథకం వర్తింపునకు రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఇప్పటికే చాలామంది చేయించుకున్నారని, ఇంకా ఎవరైనా పెండింగ్ ఉంటే వెంటనే చేయించుకోవాలని తెలిపారు. అలాగే సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టు పరిశ్రమ సాంకేతిక మండల అధికారి అంజన్‌రెడ్డి మాట్లాడుతూ... పట్టు పురుగుల పెంపకానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్రం అధికారి హర్షవర్ధన్, ఎంపీఈఓ నరేష్ పాల్గొన్నారు.

## ఎంఈఎఫ్ నాయకుల సంబరాలు

అనంతపురం వైద్యం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగోన్నతుల్లో వర్గీకరణ అమలు చేయడంపై బుధవారం నగరంలోని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఎంఈఎఫ్) నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ నాయకుడు బండారు శంకర్ మాట్లాడుతూ ఉద్యోగోన్నతుల్లో వర్గీకరణ అమలుచేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ విజ్ఞప్తిని మన్నించి ఉత్తర్వులు అమలుచేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయనాంద్, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఎస్సీ వర్గకరణ సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీతోనే సాధ్యమైందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## 24 గంటల్లో విద్యుత్‌సరఫరా పునరుద్ధరణ

గార్లదిన్నె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో మర్తాడు గ్రామంలో మంగళవారం సాయంత్రం గాలీ, వాన బీభత్సంతో ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పలు కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కాలనీ వాసులు చీకట్లో గడిపారు. స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ విజయ్‌కుమార్ బుధవారం వెంటనే సిబ్బందితో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కాలనీలకు విద్యుత్ సరఫరా పునర్ధరించారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

బుక్కరాయసముద్రం, జూన్ 18(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయం ప్రారంభంతో పాటు విగ్రహ ప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తయింది. దీంతో ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలను ఘనం గా నిర్వహించారు. శబరిమల ఆలయ ప్రధా న అర్చకుడు రాజీవర్ తంత్రి శిష్య వచ్చి ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకా లు, అలంకరణలు చేసి పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



అలంకరణలో అయ్యప్ప స్వామి

## ప్రసన్నాయపల్లిలో చోరీ

రాప్తాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసన్నాయపల్లి గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామంలో సున్నపు హరిత, అనిల్ దంపతులు. అనిల్ హైదరాబాద్‌లో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రసన్నాయపల్లిలో అతడి తల్లి సరోజమ్మ భార్య, పిల్లలు నివాసం ఉంటున్నారు. కాగా సరోజమ్మకు అనారోగ్యంగా ఉండటంతో హరిత ఈ నెల 13న అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ చేసి తర్వాత పిల్లలతో ప్రన్నాయపల్లిలో ఇంట్లో హాల్లో నిద్రించారు. అదే రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వంటగది తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలోని దుస్తులు, నాలుగు తులాల బంగారు నగలు అపహరించారు. 14న ఉదయం లేచి చూడగా చోరీకి గురైనట్లు గుర్తించి హరిత హైదరాబాద్‌లో ఉన్న భర్త అనిల్‌కు సమాచారం అందించింది. తర్వాత రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

## పందుల అపహరణ

కనగానపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదులూరు 44వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారు జామున గుర్తుతెలియని దుండగులు వాహనాన్ని అడ్డుపెట్టి పందులను అపహరించారు. తెలంగాణకు చెందిన కొందరు తమ బొలెరో వాహనంలో పందులు వేసుకొని బెంగళూరుకు వెళుతున్నారు. కాగా మార్గంమధ్యలోని దాదులూరు వద్ద గుర్తుతెలియని దుండగులు తమ వాహనాన్ని అడ్డుపెట్టి బెదిరించి దాదాపు 80 పందులను అపహరించారు. అయితే కనగానపల్లి పోలీస్‌స్టేషన్‌కు బాధితులు వెళ్లినప్పటికీ ఇంతవరకూ ఫిర్యాదు చేయలేదు.

## రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

అనంతపురం క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని హార్మొన్ సిటీ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై ట్రాఫిక్ పోలీసులు బుధవారం కేసు నమోదుచేశారు. సీపీఎం కాలనీకి చెందిన పెయింట్ వీరాంజనేయులు(48), స్నేహితుడు కొండన్నతో కలిసి మంగళవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా లారీ ఢీ కొంది. ప్రమాదంలో వీరాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందగా.. కొండన్న తీవ్రం గా గాయపడ్డాడు. ఇదే లారీ రుద్రంపేట డీ మార్ట్ వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న మరో బండల లారీని ఢీకొంది. డ్రైవర్ పరారీలో ఉన్నా డు. కేసు నమోదు చేసిన ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అనధికారిక లేఅవుట్లలో రాళ్ల తొలగింపు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలో అనుమతి లేకుండా లేఅవుట్లు వేస్తే సహించేది లేదని అహుడా చైర్మన్ టీసీ వరుణ్, వైస్ చైర్మన్ , జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ హెచ్చరించారు. వారి ఆదేశాల మేరకు బుధవారం అహుడా ప్లానింగ్ అధికారి ఇషాక్, జూనియర్ ప్లానింగ్ అధికారి హరీష్‌చౌదరి అహుడా పరిధిలోని నారాయణపురం, నరసనాయనికుంట కుంట, కక్కలపల్లి, సోములదొడ్డి పంచాయతీలలో పర్యటించారు. అక్కడ పంచాయతీ కార్యదర్శులతో కలిసి అనుమతి లేకుండా వేసిన వెలసిన లేఅవుట్లలో రాళ్లను తొలగింపజేశారు. తక్షణమే వాటి యజమానులు అహుడా అనుమతులు తీసుకోవాలన్నారు. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆలయ నిర్మాణానికి రూ.7.52 లక్షల అందజేత



ట్రస్టు సభ్యులకు నగదు అందజేస్తున్న సాకే ప్రభాకర్

నార్పల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుర్గం గ్రామంలో అహోబిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం స్థానికుడైన సాకే పెద్దమారెన్న మూడో కుమారుడు సాకే ప్రభాకర్ రూ. 7,52,070లు అందజేశారు. విశాఖపట్నంలో ఉంటూ నేవీలో ఉద్యోగం చేస్తున్న సాకే ప్రభాకర్ స్వగ్రామానికి వచ్చి ఆలయ నిర్మాణానికి అహోబిల లక్ష్మీనరసింహస్వామి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు ఆ మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో అతడి కుటుంబ సభ్యులు సాకే చిన్న మారెన్న, సాకే మల్లికార్జున, సాకే శివానంద, సాకే రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## బహుమతులు గెలిచిన వారికి అభినందనలు

అనంతపురం కలెక్టరేట్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన యోగా అభ్యాసం చేసేవారు బహుమతులు గెల్చుకున్నారు. విజయవాడలోని గుంటుపల్లి వద్దనున్న డాన్‌బాస్కో స్కూల్‌లో ఈనెల 16, 17వ తేదీల్లో నిర్వహించిన పోటీల్లో జిల్లాకు చెందిన యోగా అభ్యాసం చేసేవారు ప్రతిభ చూపించారు. వారికి బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బహుమతులు ప్రదానం చేశారు. అలాగే కలెక్టర్ వినోద్‌కుమార్ అభినందనలు తెలిపారు.



గెలుచుకున్న బహుమతులు చూపుతున్న జిల్లావాసులు

## లాఠీచార్జి అమానుషం: ఏఐఎస్ఎఫ్

అనంతపురం విద్య, జూన్ 18 (ఆంధ్రజ్యోతి)కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టాలంటూ విజయవాడలో నిరసన చేయడానికి వెళుతున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం దుర్మార్గమంటూ ఏఐఎస్ఎఫ్ నాయకులు కుళ్లాయప్ప,హనుమంతరాయుడుతదితరులు మండిపడ్డారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని జడ్పీ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థల్లో మాఫియాపై ప్రశ్నించేవాళ్లపై పోలీసులు లాఠీచార్జి చేయడం సిగ్గుచేటన్నారు. దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు మంజునాథ్, ఉమామహేష్, నాని, పవన్, ఆనందసాయి తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ భృతిని వెంటనే విడుదల చేయాలి

అనంతపురం విద్య, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే నిరుద్యోగభృతిని విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్‌కమిటీ కార్యదర్శి సంతోష్‌కుమార్ డిమాండ్‌చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన నాయకులతో కలిసి నిరుద్యోగభృతి పోరాట వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అనంతజిల్లాలోనే 7.24లక్షలమంది నిరుద్యోగులు ఉన్నారన్నారు. వారికి నెలకు రూ.3వేలు నిరుద్యోగభృతి ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. వెంటనే చెల్లించాలన్నారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు కొట్రేష్,శ్రీనివాస్, కుళ్లాయిస్వామి, ధనుంజయ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణలో నగరపాలక సిబ్బంది నిర్లక్ష్యం

●కొరడా ఝుళిపించిన కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఇంటింటి చెత్తసేకరణ, పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యంపై నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి కొరడా ఝుళిపించారు. అరవిందనగర్, కృపానందనగర్ ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ, పారిశుధ్యపనుల నిర్లక్ష్యం చేసిన 45వ వార్డు సచివాలయం శానిటేషన్ సెక్రటరీ నరసింహామూర్తిని సస్పెన్షన్ చేశారు. అలాగే 3వ సర్కిల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నగరంలో ఎక్కడైనా సరే 24గంటల్లో చెత్త తీసివేయని పక్షంలో, ఇంటింటి చెత్తసేకరణ సక్రమంగా అమలు చేయని పక్షంలో ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## కొత్త బీరువాలొచ్చాయ్..!



డీఎంహెచ్ఓ కార్యాలయంలోకి బీరువాను తీసుకెళ్తున్న దృశ్యం

అనంతపురం వైద్యం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయానికి కొత్త బీరువాలొచ్చాయి. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా నుంచి 25 బీరువాలతోపాటు మూడు మూడు టేబుళ్లను కంటైనర్‌లో పంపారు. వాటిని చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ నల్లప్ప దిగుమతి చేసుకుని స్టోర్‌లో భద్రపరిచారు. రాష్ట్ర వైద్యసేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ కొనుగోలుచేసి జిల్లాల వారిగా అవసరాన్ని బట్టి తగిన సంఖ్యలో పంపడం జరిగిందని నల్లప్ప పేర్కొన్నారు.

## షార్ట్ సర్క్యూట్.. ఇంట్లో సామగ్రి దగ్ధం

చెన్నేకొత్తపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రోనిపల్లి గ్రామంలో ఓ ఇంటిలో బుధవారం విద్యుత్‌షార్ట్‌షర్క్యూట్ జరిగి వస్తుసామగ్రి దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన నాగలక్ష్మి, చిన్ననరసింహులు దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం పశువులకు మేతను తీసుకురావడానికి పొలంలోకి వెళ్లారు. అయితే ఇంటిలో ఉన్నఫలంగా పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు తీసి చూడగా ఫ్రిజ్‌లో మంటలు మొదలై మొత్తం ఇళ్లంతా వ్యాపించాయి. దీంతో బియ్యం, ఎలక్ట్రానిక్‌వస్తువులు, దుస్తులు కాలి బూడిదయ్యాయి,రూ.8వేలు నగదు కూడా కాలిపోయింది. దీంతో కట్టుబట్టలే మిగిలాయని, ఇంటిపై కప్పు కూడా దెబ్బతిందని, రూ.3.50లక్షలకు పైగా నష్టం వచ్చిందని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ నరసింహమూర్తి, వీఆర్ఓ కదిరెప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## శవ రాజకీయాలు మానుకో జగన్

● జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ హితవు



మాట్లాడుతున్న గౌస్ మొద్దీన్

అనంతపురం క్రైం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శవ రాజకీయాలు చేయడం జగన్ ఇప్పటికైనా మానుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ హితవు పలికారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పల్నాడులో ఏడాది కింద వైసీపీ కార్యకర్త చనిపోతే.. ఇప్పుడు పరామర్శించడం ఏంటని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసమే ఈ శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ రోజు ఈ డ్రామా వల్ల జగన్ కాన్వాయ్ కింద పడి ఓ వ్యక్తి మరణించాడన్నారు. దీనికి ముమ్మాటికి జగనే కారణం అన్నారు. ఇప్పటికైనా ప్రజల ప్రాణాలతో ఆడుకోవడం మానుకోవాలని సూచించారు. టీడీపీ నాయకులు లక్ష్మినారాయణ, హర్షవర్ధన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### తల్లికి వందనం సమస్యలు పరిష్కరించండి

యాడికి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనానికి సంబంధించిన భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ సమస్యతో అర్హులైన ఏ ఒక్క విద్యార్థి కూడా తల్లికి వందనం రాలేదనే ఫిర్యాదులు ఉండకూడదన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ కిష్టప్ప పాల్గొన్నారు.

### నేడు కేంద్ర బృందం రాక

యల్లనూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకాయ మంద, మల్లాగుండ్ల గ్రామాల్లో గురువారం కేంద్రబృందం పర్యటిస్తున్నట్లు ఎంపీడీఓ కరుణసాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలిస్తారన్నారు.

### సీపీఐ నాయకుడి మృతి

పెద్దవడుగూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీఐ నాయకుడు, మాజీ సర్పంచు రామిరెడ్డి (65) బుధవారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. ఆయన మృతదేహానికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, మండల కార్యదర్శి వెంకటరాముడుయాదవ్, సూర్యనారాయణరెడ్డి, నారాయణ నివాళులర్పించారు.

### నీటి తొట్టె ధ్వంసం

కుందుర్పి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డేపాలెం గ్రామంలో పశువుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన తాగునీటి తొట్టెను అదే గ్రామానికి చెందిన గీతమ్మ ధ్వంసం చేసింది. దీనిపై ఆ గ్రామస్థులు, పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

### మీ సేవాకేంద్రాల తనిఖీ

బ్రహ్మసముద్రం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నేపల్లి, రాయలప్ప దొడ్డి, బొమ్మగానపల్లి గ్రామాల్లోని మీసేవా కేంద్రాలను తహసీల్దార్ సుమతి తనిఖీ చేశారు. ప్రభుత్వం కేటాయించిన ధరలను మాత్రమే వినియోగదారుల నుంచి వసూలు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ సుమతి, ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వో ఉన్నారు.

### దివ్యాంగురాలి కుటుంబానికి అన్యాయం

డీ.హీరేహాళ్ (రాయదుర్గం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక బళ్లారి - రాయదుర్గం రోడ్డు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో దివ్యాంగురాలు జయమ్మ, రవి ఏర్పాటు చేసుకున్న టీ కొట్టు తొలగించి .. ఆ కుటుంబాన్ని వీధి పాలు చేయడం అన్యాయమని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సంఘం జిల్లా అధ్యక్షుడు వసంత్‌కుమార్ బుధవారం అన్నారు. ఈ కొట్టును తొలగిస్తే తన స్థలానికి మంచి డిమాండ్ వస్తుందని ఓ వ్యక్తి అధికారులతో అండతో ఆ కొట్టును తొలగించారని మండిపడ్డారు. దీన్ని రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీరికి న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు.

### పోలీసుల దాడిపై నిరసన

రాయదుర్గంరూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల దోపిడీని అరికట్టాలని శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులపై పోలీసులు దాడి చేశారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజినేయులు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వినాయకసర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సచిన్, అక్బర్, కార్తీక్, హుస్సేన్, రాజేష్ పాల్గొన్నారు.

### ఇన్‌చార్జి ఎంపీడీఓగా రంగనాయకులు

బ్రహ్మసముద్రం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఈఓఆర్డీ రంగనాయకులను ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓగా నియమిస్తూ జడ్పీ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం ఆయన ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపీడీఓ నందకిషోర్ జడ్పీకి బదిలీ అయ్యారు.

### సమస్యలు పరిష్కరించాలని రాస్తారోకో

గుత్తి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలోని నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు, కార్యకర్తలు స్థానిక గాంధీ సర్కిల్‌లో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. బీసీ కాలనీ, జడ్‌వీరారెడ్డి కాలనీలకు ప్రధాన రహదారులు నిర్మించాలని, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని, నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, నాయకులు రామకృష్ణ, రేణుకా, మల్లికార్జున, అశోక్, రేవతి పాల్గొన్నారు.

### రైతు కుటుంబానికి పరామర్శ

గుంతకల్లుటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లదాసరిపల్లి గ్రామానికి చెందిన రైతు గండాల నాగలింగ అప్పుల బాధతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెల్సిందే. బుధవారం తహసీల్దార్ రమాదేవి, మండల వ్యవసాయ అధికారి లీనా వసుంధర బుధవారం ఆ గ్రామానికి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ. 15 లక్షల అప్పు ఉన్నట్లు బాధితులు తెలిపారు. నివేదికను ఉన్నతాధికులకు అందజేస్తామని ఆ అధికారులు తెలిపారు.

### హెచ్చెల్సీ మరమ్మతుల పరిశీలన

కణేకల్లు/బొమ్మనహాళ్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ సబ్‌డివిజన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతు పనులను ఆ శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. కణేకల్లులోని శ్రీచిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు వద్ద జరుగుతున్న ఔట్‌ఫాల్ రెగ్యులేటర్ పనులను హెచ్చెల్సీ ఈఈ పార్థసారథి, డీఈ దివాకర్‌రెడ్డి పరిశీలించారు. అలాగే బొమ్మనహాళ్, దర్గాహోన్నూరు హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలో జరుగుతున్న అత్యవసర మరమ్మతు పనులనూ పరిశీలించారు. పనులను నాణ్యతగా.. సకాలంలో పూర్తి చేయాలన్నారు. వారి వెంట ఏఈ నరేంద్రమారుతి ఉన్నారు.

## ఏడాదైనా మేల్కోని ఉద్యోగులు

### నేటికీ కనిపిస్తున్న జగన్ పోస్టర్లు




సచివాలయం వద్ద బోర్డుపై జగన్ బొమ్మ ఉన్న స్టిక్కర్

కూడేరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జగన్ సర్కార్ పతనమై ఏడాదైనా సచివాలయ ఉద్యోగులు ఇంకా నిద్ర మేల్కొనలేదు. స్వామి భక్తి వీడలేదు. దీంతో నేటికీ జగన్ పోస్టర్లు కనిపిస్తూనే ఉన్నాయి. కూడేరు మండలం కమ్మూరు గ్రామ సచివాలయం వద్ద ఉన్న రైతు సేవా కేంద్రానికి జగన్ ఫొటోతో ఉన్న నవరత్నాల పోస్టర్, అదే ప్రదేశంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం వద్ద జగన్ బొమ్మ ఉన్న బోర్డు దర్శనమిస్తున్నాయి.




రైతు సేవా కేంద్రానికి ఉన్న నవరత్నాల పోస్టర్

## వికసిత్ భారత్ సంకల్ప సభ

గుంతకల్లుటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పాత గుంతకల్లులోని అంకాలమ్మ దేవాలయంలో వికసిత్ భారత్ సంకల్ప సభ బుధవారం నిర్వహించారు. ఇందులో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలమి రామాంజినేయులు, నాయకులు పాల్గొన్నారు.

# వేదన తీరేదెప్పుడో..?

- భూసమస్యల పరిష్కారం కోసం రైతుల నిరీక్షణ
- పట్టించుకోని అధికారులు ● చావే శరణ్యం అంటున్న అన్నదాతలు

విడపనకల్లు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు తీర్చే నాథుడే లేడని మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విడపనకల్లు తహసీల్దారు కార్యాలయం వద్ద తమ కష్టాల ను రైతులు బుధవారం వెళ్లడించారు. పాల్తూరు గ్రామానికి చెందిన సుధాకర్, ఖాజాపీరా, డొనేకల్లుకు చెందిన లక్ష్మి తమ పొలాలను పాస్‌బుక్కుల్లోకి ఎక్కించాలని ఆరేళ్ల నుంచి తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే పని మాత్రం కావడం లేదు.



తహసీల్దారు కార్యాలయం

### ఐదేళ్లుగా తిరుగుతున్నా



మాకు ఉన్న మూడు ఎకరాలు పొలాన్ని వేరే వాళ్ల పాస్ బుక్‌లోకి ఎక్కించారు. దాన్ని తొలగించి మా పట్టాదారు పాస్ బుక్ లోకి ఎక్కించి ఇవ్వమని అడిగితే ఏ అధికారులు పట్టించుకోవటం లేదు. ఫైలు ఆర్డీఓ కార్యాలయానికి పోయింది. ఈ వారంలో పని అయిపోతుందిలే అంటూ సంవత్సరాలు గడుపుతున్నారు. మరి ఎప్పటికి మా భూమిని మాకి చేయించి ఇస్తారో చూడాలి.

- లక్ష్మి, రైతు, డొనేకల్లు

### పోలీస్‌స్టేషన్‌లో పెట్టారు



నా పొలాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించాలని ఆరేళ్లుగా కలెక్టరేట్, విడపనకల్లు తహసీల్దారు కార్యాలయానికి తిరిగినా ఒక్కరూ పట్టించుకోలేదు. ఇప్పటివరకూ 39 సార్లు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశా. నెల రోజుల కిందట కలెక్టరేట్‌లో నా పొలం విషయమై అధికారులను గట్టిగా అడిగిన పాపానికి ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకూ స్టేషన్‌లో కూర్చోబెట్టారు. నా ఐదు ఎకరాలు పొలం ఎక్కడా రికార్డుల్లో లేకుండా చేశారు. తిరిగి తిరిగి అలసి పోయా రూ. లక్ష వరకూ ఖర్చు చేసుకున్నా. ప్రభుత్వ పథకాలు రాకుండా పోయాయి. అధికారులు పట్టించుకోవటం లేదు. విడపనకల్లు తహసీల్దారు కార్యాలయం ఎదుట ఉరి వేసుకుంటే అప్పుడైనా స్పందిస్తారా?

- ఖాజాపీరా రైతు పాల్తూరు

### 19 సార్లు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశా



నాకు మా పెద్దల నుంచి వచ్చిన భూమి ఆరు ఎకరాలు ఉంది. దీన్ని దేవాలయ భూమిగా రికార్డుల్లోకి ఎక్కించారు. నా సొంత భూమిని మార్చాలని జిల్లా అధికారులకు 19 సార్లు దరఖాస్తు చేశా. అయినా ఒక్కరూ స్పందించలేదు. దేవదాయ శాఖ అధికారుల వద్దకు విజయవాడకు, అనంతపురం కలెక్టరేట్‌లకు ఎన్ని సార్లు తిరిగానో లెక్కేలేదు. రెండేళ్ల కిందట అనంతపురం వెళ్లి పాల్తూరుకు ద్విచక్రవాహనంపై వస్తూ కింద పడ్డా. కాలు విరిగింది. రాడ్లు వేశారు. నాయకులు వద్దకు వెళ్లి నా సమస్యను తెలిపా. అయినా ఒక్కరూ పట్టించుకోలేదు. విడపనకల్లు తహసీల్దారు కార్యాలయం వద్ద ఆత్మహత్య చేసుకుంటే అప్పుడు మా భూమిని మాకి చేస్తారా? అనిపిస్తోంది.

- సుధాకర్, రైతు పాల్తూరు




పుస్తకాలు అందిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

## విద్యార్థులకు పుస్తకాల అందజేత

రాయదుర్గం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు బుధవారం అందజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● యోగా విశిష్టతపై అవగాహన: యోగా విశిష్టతపై పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయంలో విప్ కాలవ శ్రీనివాసులు బుధవారం అవగాహన కల్పించారు. ఈనెల 21న విశాఖపట్నంలో ఐదు లక్షల మందితో నిర్వహిస్తున్న సామూహిక యోగా వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాల్గొంటున్నారని తెలిపారు.

● టోర్నీ నిర్వాహకులకు సన్మానం

బొమ్మనహాళ్/కణేకల్లు: నియోజకవర్గంలో కాలవ క్రికెట్ లీగ్ టోర్నీని విజయవంతంగా నిర్వహించిన వారిని ప్రభుత్వ విప్ కాలవ బుధవారం రాయదుర్గంలోని తన స్వగృహంలో సన్మానించారు. బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట, గోనేహాళ్ గ్రామాలకు చెందిన టీడీపీ యువనాయకులు రవిచంద్రసాగర్, రమేష్‌ను, కణేకల్లు పట్టణ తెలుగుయువత అధ్యక్షుడు షేక్‌ముజ్జును విప్‌తో పాటు కాలవ భరత్ సన్మానించారు.

## సిబ్బంది కొరతతో ఇబ్బంది



ఖాతాదారులతో కిటకిటలాడుతున్న యూనియన్ బ్యాంకు

బెళుగుప్ప, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక యూనియన్ బ్యాంకులో బ్యాంకు మేనేజర్‌తో పాటు ఎనిమిది మంది అధికారులకు గాను ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉన్నారు. దీంతో తల్లికి వందనం లబ్ధిదారులు, రుణాల రెన్యువల్ కోసం రైతులు , స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోందని, బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

### కసాపురంలో తిరుమంజన స్నపన పూజలు

గుంతకల్లు టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా బుధవారం తిరుమంజన స్నపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను కొలువు దీర్చారు. తిరుమంజన స్నపన, మన్యుసూక్త హోమం నిర్వహించారు.



అలంకరణలో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలు

## వేతనాలు చెల్లించాలని ధర్నా

గుంతకల్లుటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తమకు బకాయి ఉన్న మూడు నెలల వేతనాలను చెల్లించాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. అలాగే తమకు యూనిఫాం, సబ్బులు, నూనె, పనిముట్లు ఇవ్వాలన్నారు. తమను రెగ్యులర్ చేయాలని, తల్లికి వందనం పథకం అమలు చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ రాధాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జగదీష్, నాగరాజు, నరసయ్య, రంగనాయకులు, ప్రేమ్‌కుమార్, దాస్, శ్యామెల్ పాల్గొన్నారు.

● ఇంజనీరింగ్ కార్మికులు: తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ఇంజనీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు మల్లేష్, నాయకులు టీజీ సురేష్, మస్తాన్, సురేంద్ర, సుంకన్న, నరేష్ పాల్గొన్నారు.

## అధికారుల అవినీతిపై దుమారం

కళ్యాణదుర్గం , జూన్ 18(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లో మండలంలోని ఓ సర్వేయర్ అవినీతిపై, ట్రాన్స్‌కో లైన్‌మన్ అవినీతిపై సోషల్ మీడియాలో బుధవారం దుమారం రేగింది. ఎవరు డబ్బులిస్తే వారి పొలాలను మాత్రమే సర్వే చేస్తానని, మీకు దిక్కున్న చోట చెప్పుకోవాలని ఓ సర్వేయర్ రైతులను బెదిరిస్తున్నట్లు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు వైరల్ అయ్యాయి. అలాగే వినియోగదారుడు కరెంటు బిల్లు ఇచ్చినా రసీదు ఇవ్వకుండా ట్రాన్స్‌కో లైన్‌మన్ చేతివాటం ప్రదర్శించారని, బిల్లు అడిగిన వినియోగదారుడిపై ఆయన దురుసుగా ప్రవర్తించిన సంభాషణ సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది కూడా వైరల్ అయింది. ఒకే రోజు ఇద్దరు అధికారుల అవినీతిపై పెట్టిన పోస్టులు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారాయి. మరి ఆ అధికారులపై ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## సమస్యలపై యోగాసనాలతో నిరసన



యోగాసనాలతో నిరసన చేస్తున్న కార్మికులు

గుత్తి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయంలోని ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయ ఎదుట బుధవారం యోగాసనాలతో నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు మాట్లాడుతూ.. యోగా దినోత్సవాల పేరుతో ప్రభుత్వాలు రూ. కోట్లు ఖర్చు చేస్తున్నాయని, మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఇవ్వడంపై మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఈ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 23న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్, మురళీ, రవి, ఆదినారాయణ, నరసింహులు, పారిశుధ్య కార్మికులు రామాంజినేయులు, సూర్యనారాయణ, ఈశ్వరయ్య, మహేష్ పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసరాల పంపిణీ



సరుకులు అందజేస్తున్న వెలుగు అధికారులు

కళ్యాణదుర్గం , జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హులికల్లు గొల్లలదొడ్డి కాలనీ పొదుపు మహిళా సంఘాల సభ్యులు గ్రామస్వరాజ్య నిధిని ఏర్పాటు చేసి ప్రతినెలా తోచినంత నగదును జమ చేశారు. అలా జమ చేసిన నగదుకు వచ్చిన వడ్డీ మొత్తంతో నియోజకవర్గంలోని సుమారు 34 కుటుంబాలకు ఒకొక్క కుటుంబానికి రూ. 2500 విలువైన నిత్యావసర సరుకులను వెలుగు అధికారులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ రామాంజినేయులు, సీవో సలీమ్, పంచాయతీ సర్పంచ్ చిత్తప్ప, ఆర్డీటీ స్కూలు కమిటీ మెంబర్లు, డీలర్ కిష్టప్ప పాల్గొన్నారు.

### శ్మశానస్థలం పునరుద్ధరణకు శ్రీకారం

తాడిపత్రి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం సమీపంలోని శ్మశాన వాటికలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సమాధులు తొలగించి.. ఆ స్థలం పునరుద్ధరణకు బుధవారం శ్రీకారం చుట్టారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, కుల సంఘాల పెద్దల ఆధ్వర్యంలో బ్రాహ్మణులు పూజలు నిర్వహించిన అనంతరంబ సమాధులను తొలగించే పనులు చేపట్టారు. అస్తికలను కాల్చి గంగానదిలో కలపాలని నిర్ణయించుకున్నారు.

## చిన్న గాలివీస్తే... కరెంట్ కట్...!

**ఎడాపెడా కోతలతో ప్రజల ఇబ్బందులు**

కళ్యాణదుర్గం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి గాలివీస్తే చాలు ... కరెంట్ సరఫరాను ట్రాన్స్‌కో అధికారులు ఆపేస్తున్నారు. కొన్ని రోజులుగా ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కళ్యాణదుర్గం టౌన్, కంబదూరు మండలాలతోపాటు మరికొన్ని మండలాల్లో ఈ పరిస్థితి దారుణంగా ఉంది. ఐదు నిమిషాలకు ఒక్కసారి విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నారు. అంతేకాకుండా హై... లో ఓల్టేజీల కారణంగా ఎలక్ట్రికల్ వస్తువులన్నీ దెబ్బతింటున్నాయని, ట్రాన్స్‌కో అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

### పశువుల పేడ ఎరువులతో అధిక దిగుబడి

విడపనకల్లు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే సమయంలో దుక్కిలోకి పశువుల పేడ ఎరువులు వాడాలని, తద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ పెన్నయ్య సూచించారు. మండలంలోని పాల్తూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతపురం రైతు శిక్షణా కేంద్రం ఏఓ లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ.. వేరుశనగలో ఆకు తినే పురుగు, శనగ పచ్చ పురుగు నివారణకు ఇమమెక్టిన్ బెంజిట్ ఒక గ్రాము, వేప నూనె ఐదు ఎంఎల్‌లు ఒక లీటర్ నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. ఆకు మచ్చ తెగులకు హెక్సికోనోజోల్ రెండు ఎంఎల్‌లు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ప్రతి రైతూ మట్టి పరీక్షలు చేయించి తగిన మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ మెర్సి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

● ఉరవకొండ: బోరుబావుల క్రింద సాగు చేసిన వేరుశనగ పంటకు శనగపచ్చపురుగు, పచ్చదోమ సోకే అవకాశముందని ఏవో రమకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని పెద్దముష్టూరు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రస్తుతం వేరుశనగ పంట 80-90 రోజుల కాలవ్యవధిలో ఉందని, శనగపచ్చపురుగు, పచ్చదోమ నివారణకు లామ్డా సహాల్త్రిన్ 2 మిల్లీలీటర్‌కు ఒక లీటర్ నీటిని, థయో మిథాగ్జం ఒక మిల్లీ గ్రాంకు ఒక లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలని సూచించారు. బూజు తెగుళ్ల కూడా సోకే అవకాశముందని, టిబో కొనజోల్ ఒక మిల్లీలీటర్‌కు ఒక లీటర్ నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## క్రైం న్యూస్..

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొమ్మనహాళ్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ మండలం అమిదాల గ్రామానికి చెందిన మారాశి వెంకటప్ప (45) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించాడు. ఇతను మండలంలోని తర్కాపురం గ్రామ సమీపంలో ఈ నెల 12న బైక్ నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ కమ్మల్‌బాషా తెలిపారు.

### వైసీపీ నాయకుడి దాడి

శెట్టూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన దేవరమ్మ, గిడ్డన్న, వారి కుటుంబ సభ్యులపై లక్ష్మంపల్లికి చెందిన వైసీపీ నాయకుడు వడ్డె ముత్యాలు, తన బంధువులతో కలిసి మంగళవారం రాత్రి దాడి చేశాడు. 2023లో భూమి పట్టా చేయిస్తానని గిడ్డన్న నుంచి వడ్డె ముత్యాలు రూ. 1.30 లక్షలు తీసుకున్నాడు. ఇంతవరకు పట్టా చేయించకపోవడంతో ఆ డబ్బు తిరిగి ఇవ్వాలని మంగళవారం రాత్రి వడ్డె ముత్యాలు ఇంటికి వెళ్లి.. గిడ్డన్నతో పాటు అతని కుటుంబ సభ్యులు అడిగారు. దీంతో వారిపై వడ్డె ముత్యాలు, తన బంధువులతో దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఇన్‌చార్జి ఎస్ఐ నరేంద్ర కుమార్ తెలిపారు.

### దాడిపై ఫిర్యాదు

యల్లనూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో శింగవరం గ్రామానికి చెందిన శేఖర్‌పై మంగళవారం దాడి చేసిన వారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వైసీపీ ఎస్సీ సెల్ నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఇందులో పూల ప్రసాద్, సూర్యనారాయణ, తిమోతి, నాగరాజు పాల్గొన్నారు.

### వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక తాడిపత్రి రోడ్డులో బుధవారం బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని వెంగన్నపల్లి వాసి శ్రీనివాసులు గాయపడ్డాడు. అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ముగ్గురిపై కేసు

యాడికి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వెంగన్నపల్లి గ్రామానికి చెందిన ఓబులరెడ్డి, చెంచురెడ్డి మధ్య భూ తగాదా ఉంది. బుధవారం ఓబులరెడ్డి ఇంటికి వెళుతుండగా చెంచురెడ్డితో పాటు శివప్రసాద్‌రెడ్డి, లక్ష్మినాథరెడ్డి దాడిచేశారు. ఓబులరెడ్డి ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

రాయదుర్గం, జూన్18(ఆంధ్రజ్యోతి): పూలకుంట గ్రామానికి చెందిన వడ్డే సురేష్ ఓ బాలికను వివాహం చేసుకుంటానని నమ్మించి మాయమాటలు చెప్పి అత్యాచారం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు వడ్డే సురేష్‌పై ఫోక్సో కేసు నమోదు చేసి.. బుధవారం అరెస్ట్ చేశామని, నిందితుడిని కోర్టులో హాజరుపరిచామని సీఐ వెంకటరమణ తెలిపారు.

### మందుబాబుల దుశ్చర్య - గడ్డివామి దగ్ధం

యాడికి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మందుబాబుల దుశ్చర్యతో యాడికిలో ఓ గడ్డివాము బుధవారం దగ్ధమైంది. యాడికికి చెందిన రైతు మాదాసు రామిరెడ్డి పాడి పశువుల కోసం గడ్డి కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నాడు. బుధవారం సాయంత్రం గుర్తుతెలియని మందుబాబులు మద్యం సేవించి మద్యం మత్తులో నిప్పు పెట్టారు. మంటలు చెలరేగడంతో స్థానికులు వాటిని ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. తమకు సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

### ఆటోమొబైల్ షాపు..

తాడిపత్రి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఆటోనగర్‌లో కొండప్పకు చెందిన సుదర్శన లారీ స్పేర్ పార్ట్స్ ఆటోమొబైల్ షాపు బుధవారం దగ్ధమైంది. ఆ షాపు వెనుక వైపున ఉన్న చెత్తలో గుర్తుతెలియని వ్యక్తులు బీడీ తాగి వేయడంతో మంటలు రేగాయి. అవి ఆటోమొబైల్‌షాపులోకి వ్యాపించడంతో దాదాపు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం అయింది. ఇతరషాపులకు ఆ మంటలు వ్యాపించకుండా ఫైర్ సిబ్బంది చర్యలు చేపట్టారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదైందని ఫైర్ అధికారి మోహన్‌బాబు తెలిపారు.



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న దళిత రైతులు

## భూములు మా పేరిట మార్చండి సార్

విడపనకల్లు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): 'సార్.. 20 ఏళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దేవాలయ భూములను కొనుగోలు చేసి.. దాదాపు 160 మందికి ఒక్కొక్కరికి ఒక ఎకరం ప్రకారం రిజిష్టర్ చేయించింది. వ్యక్తగత పాస్‌బుక్‌లు కూడా ఉన్నాయి. బ్యాంక్‌ల్లో రుణాలు కూడా తీసుకున్నాం. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో రీ సర్వే చేసే సమయంలో ఆ భూములను దేవాలయ భూములుగా మార్చింది. మాకు న్యాయం చేయాలని అప్పటి నుంచి రెవెన్యూ అధికారులు చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. అవి దేవాలయ భూమిగా ఉండటంతో ప్రస్తుతం మాకు అన్నదాత సఖీభవా పథకం వర్తించదు. ఆ భూములను మళ్లీ తమ పేరుకు మార్చండి... సార్..' అని మండలంలోని కరకముక్కల గ్రామానికి చెందిన దళితులు బుధవారం తహసీల్దారు చంద్రశేఖరయ్యకు వినతి పత్రం అందించారు.